శుక్రవారం
23-06-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 02
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గ్రీస్‌లో ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీ

గ్రీస్‌లో ఈ నెల 25న జరిగే సాధారణ ఎన్నికల సందర్భంగా రాజధాని ఏథెన్స్‌లో కేకేఈ భారీ ర్యాలీ నిర్వహించింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ గ్రీస్ (కేకేఈ) ఆధ్వర్యంలో జరిగిన ఈ రాజకీయ ర్యాలీకి హాజరయ్యేందుకు సింటాగ్మా స్క్వేర్‌లో బుధవారం సాయంత్రం వేలాది మంది ఎథీనియన్లు హాజరయ్యారు.

2 లో

11 సర్టిఫికెట్లు జారీ

ఉచితం

యూజర్ చార్జీలు ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే గడప గడపకూ, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను వరుసగా తీసుకొచ్చిన జగన్ సర్కార్ తాజాగా జగనన్న సురక్ష అనే మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 24వ తేదీ నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు అందని వారిని గుర్తించి, అర్హులైన వారికి తక్షణమే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు జులై 23వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందుకోసం గ్రామ సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థతోపాటు, పార్టీ నాయకత్వం మొత్తాన్ని ఇంటింటికీ తిరగాలని సీఎం ఆదేశించారు. నవరత్నాలతోపాటు ప్రజలకు అవసరమైన వివిధ సర్టిఫికెట్లు గ్రామాల్లో క్యాంపులు

- మిగతా 2 లో

రాష్ట్రంలో అరాచక పాలనకు వ్యతిరేకంగా

ఐక్య ఉద్యమాలు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు
- ఈ నెల 27న కలెక్టర్లకు వినతి పత్రాలు
- సీఎం, డీజీపీ మైండ్‌సెట్ మారాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో అరాచకాలు పెరిగాయని, వాటిని ఎదుర్కోవటానికి ఐక్య ఉద్యమాలకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. రాష్ట్రంలో దళితులు, మైనార్టీలు, మహిళలు, జర్నలిస్టులు, పిల్లలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అరాచకాలు, హత్యలను నిరసిస్తూ సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో విజయవాడ దాసరి భవన్‌లో గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ హైకోర్టు న్యాయవాదిని హత్య చేయటానికి హైకోర్టు సమీపంలోనే రెక్కీ నిర్వహించారనే వార్త ఆందోళన కలిగించే విషయం అన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రతిపక్షాలు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, హైకోర్టు, డీజీపీ ఎవరన్నా లెక్కలేకుండా పోయిందన్నారు. బాపట్ల జిల్లాలో బాలుడు అమర్‌నాథ్‌ను కాల్చి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిలేని నిరుపేద కుటుంబానికి చెందిన తండ్రి లేని 14 ఏళ్ల బాలుడు అగ్ర వర్ణానికి చెందిన వారితో ఎదురు మాట్లాడతాడా? అని అన్నారు. డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డుపై రెక్కలు విరిచి కొట్టారని, పిచ్చివాడిగా ముద్రవేసి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారని తెలిపారు. ఎమ్మెల్సీ కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేయటమే కాకుండా గర్భిణీ అయిన అతని భార్యను బెదిరించారని గుర్తు చేశారు. ఇంత జరుగుతున్నా రాజకీయ పార్టీలు పెద్దగా స్పందించటం లేదని అన్నారు. హోం మంత్రి బర్త్‌డే పార్టీలకు, పేరంటాలకు వెళ్లడం తప్ప బాధితులను పరామర్శించటం లేదన్నారు. డీజీపీ కంటే పెత్తందారి ఇంట్లో పెద్ద జీతగాడు నయం అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడటం లేదని విమర్శించారు. వలంటీర్లను ఉపయోగించుకుని గ్రాఫ్ పెంచుకోవాలని ఎమ్మెల్యేలకు జగన్ సూచిస్తున్నారని అన్నారు. సమాజంలో జరుగుతున్న దురాగతాలను అదుపు చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సీఎం, డీజీపీ మైండ్‌సెట్ మారకపోతే రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడటం కష్టం అని తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు వర్ల రామయ్య మాట్లాడుతూ సిట్టింగ్ ఎంపీ ఏమి చేస్తున్నాడో తెలియదుగానీ, ప్రతిపక్ష నాయకులు ఏమి చేస్తున్నారో మాత్రం తెలుస్తుందన్నారు. ఎంపీ వేరే రాష్ట్రానికి తరలిపోతానని చెబితే ఎవరు సిగ్గు పడాలని సందేహం వెలిబుచ్చారు. పోలీసు స్టేషన్‌లు వైసీపీ నాయకులకు అత్తారిల్లుగా మారాయని ఆరోపించారు. రాష్ట్రమా, రావణ కాష్టమా అని ప్రశ్నించారు. ఆర్టికల్ 355ను అమలు చేయాలని గవర్నర్‌ను కోరదామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ బాపట్ల ఘటనపై జాతీయ మీడియా స్పందించినా సీఎం జగన్ స్పందించ లేదన్నారు. గంజాయి ఏపీ నుంచి వస్తుందని, పక్క రాష్ట్రాలకు చెందిన పాలకులు ప్రెస్‌మీట్‌లు పెట్టి చెబుతున్నా లెక్కలేనితనంగా ఉంటున్నారని చెప్పారు. గోరంట్ల మాధవ్ వ్యవహారంలో వేగంగా స్పందించారని గుర్తు చేశారు. వైసీపీ నాయకులను కాపాడుకోవటానికి

- మిగతా 2 లో

బీజేపీని గద్దె దించేందుకు

ఉమ్మడి వ్యూహం

నేడు పాట్నాలో విపక్షాల సమావేశం

లక్నో : కేంద్రంలోని ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా విపక్ష పార్టీలు ఉమ్మడి వ్యూహం రూపొందించేందుకు సన్నద్ధమవుతున్నాయి. అయితే శుక్రవారం పాట్నా వేదికగా జరిగే ఈ సమావేశానికి ముందు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రతిపక్ష నేతల సమావేశానికి ఉత్తరప్రదేశ్ నుంచి సమాజ్ వాదీ పార్టీ మాత్రమే హాజరవుతుంది. అయితే బీఎస్‌పీ అధినేత్రి మాయావతిని ఆహ్వానించలేదు. రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ఎల్‌డీ) అధినేత జయంత్ చౌదరి కుటుంబ కార్యక్రమం కారణంగా సమావేశానికి హాజరుకావడం లేదు. కాగా, ఈ సమావేశం 'ప్రతిపక్ష ఐక్యతా మార్గంలో ముఖ్యమైన మైలురాయి' అవుతుందని చౌదరి ఆశాభావం వ్యక్తం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఢీకొట్టేందుకు ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించేందుకు బీహార్ ముఖ్యమంత్రి, జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ ప్రతిపక్ష పార్టీల సమావేశానికి పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలన్నీ చేతులు కలపాలని ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్ పిలుపునిచ్చారు. విపక్షాల సదస్సులో పాల్గొనాల్సిన పార్టీలను లక్ష్యంగా చేసుకుని గురువారం మాయావతి ఈ సమావేశాన్ని హృదయాల కంటే చేతులు కలపడమే ఎక్కువని అభివర్ణించారు. విపక్షాల సమావేశానికి బీఎస్పీ అధినేతకు ఆహ్వానం అందలేదు. జేడీ(యూ) ముఖ్య అధికార ప్రతినిధి కె.సి.త్యాగి పీటీఐతో మాట్లాడుతూ '2024లో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడటానికి సిద్ధంగా ఉన్న పార్టీలను మేము ఆహ్వానించాము. బీఎస్‌పీ కూటమిలో భాగం కాబోదని, అప్పుడు మేము మా ఆహ్వానాన్ని ఎందుకు వృధా చేయాలి' అని తెలిపారు. ఇదిలాఉండగా, ఉత్తరప్రదేశ్‌లో తమ లక్ష్యం పట్ల ప్రతిపక్ష పార్టీలు సీరియస్‌గా ఉన్నట్లు కనిపించడం లేదని మాయావతి అన్నారు. 'యూపీలోని 80 లోక్‌సభ స్థానాలు ఎన్నికల విజయానికి కీలకమని చెబుతున్నారు. కానీ ప్రతిపక్ష పార్టీల వైఖరిని చూస్తే వారు ఇక్కడ తమ లక్ష్యం గురించి తీవ్రంగా, నిజంగా ఆందోళన

- మిగతా 2 లో

ప్రచార సాధనాలు సమాజ చలనానికి అద్దం పట్టాలి

- ఉత్పత్తి సాధనంగా మారిన వార్త
- విశాలాంధ్ర వార్షికోత్సవ సభలో వేణుగోపాల్

ఏ లక్ష్యాలు నెరవేర్చటానికి పత్రికలు ఏర్పడ్డాయో వాటి ప్రాధాన్యతలు నిర్ణయించుకుని సమాజ చలనానికి అద్దం పట్టాలని వీక్షణం మాసపత్రిక సంపాదకులు ఎన్.వేణుగోపాల్ అన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్వర్యంలో నిర్వహించిన విశాలాంధ్ర దినపత్రిక 71 వ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వర రావు అధ్యక్షతన గురువారం విజయవాడలోని విశాలాంధ్ర ప్రధాన కార్యాలయంలో ఈ సభ జరిగింది.

8లో

ఎగవేతదారుల కొమ్ముకాసేలా

ఆర్బీఐ సూచన

- ఆర్థిక సంస్థల స్థిరత్వానికి పెద్ద దెబ్బ
- నిర్మలా సీతారామన్‌కు రాసిన లేఖలో వినయ్ విశ్వం

2లో

చైనా-ఫ్రాన్స్ సహకారం మరింత బలోపేతం



పారిస్ : చైనా, ఫ్రాన్స్‌లు ప్రపంచ పారిశ్రామిక, సరఫరా గొలుసుల భద్రత, స్థిరత్వాన్ని సంయుక్తంగా నిర్వహించాలని, నూతన ఆవిష్కరణలపై సహకారాన్ని బలోపేతం చేయాలని, సుహృద్భావ వ్యాపార వాతావరణాన్ని పెంపొందించుకోవాలని చైనా ప్రధాని లీ కెకియాంగ్ పిలుపునిచ్చారు. ప్యారిస్‌లో చైనా, ఫ్రెంచ్ వ్యాపార సంఘాలతో జరిగిన విందులో ప్రసంగిస్తూ చైనా-ఫ్రాన్స్ సహకారంపై మూడు పాయింట్ల ప్రతిపాదన చేశారు. ఈ సమావేశానికి ఫ్రెంచ్ ఆర్థిక మంత్రి బ్రూనో లీ మైర్‌తో పాటు రెండు దేశాల వ్యాపార సంఘాలకు చెందిన 100 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. రెండుదేశాలు పరస్పరం ఆధారపడటం అనేది ఆర్థిక ప్రపంచీకరణలో అనివార్య పరిణామమని, చైనా, ఫ్రాన్స్‌ల మధ్య ఉన్న దృఢమైన రాజకీయ పరస్పర విశ్వాసంతో పరస్పర ఆధారపడటంతో రెండుదేశాల ఉమ్మడి అభివృద్ధికి, అవకాశాలకు వీలు కల్పిస్తుందని లీ చెప్పారు. చైనా, ఫ్రెంచ్ అధ్యక్షులిద్దరూ ఆర్థిక ప్రపంచీకరణకు దృఢంగా మద్దతు ఇస్తారని, విన్-విన్ సహకారం కోసం చర్యలు తీసుకుంటారని చైనా, యూరప్ మధ్య పారిశ్రామిక, సరఫరా గొలుసుల స్థిరత్వాన్ని సంయుక్తంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నామని లీ పేర్కొన్నారు. ఇన్నోవేషన్‌పై చైనా-ఫ్రాన్స్ సహకారాన్ని బలోపేతం చేయడం, వైద్యంలో చైనా-ఫ్రాన్స్ సాంకేతిక వినిమయం, బ్యాటరీలు, సెమీకండక్టర్లు, ఇతర రంగాల్లో అనేక వినూత్న విజయాలను అందించాయని లీ అన్నారు. చైనా-ఫ్రాన్స్ సహకారానికి కొత్త వృద్ధి పాయింట్లను ప్రోత్సహించడానికి ఇరుపక్షాలు తమ సంస్థల మధ్య ఆవిష్కరణ, సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయాలని చైనా ప్రధాని అన్నారు. చైనా ఆధునిక సేవా రంగంలో మార్కెట్ యాక్సెస్‌ను మరింత సులభతరం చేస్తుందని లీ చెప్పారు. చైనా ఇంటర్నేషనల్ ఇంపోర్ట్ ఎక్స్‌పోలో చురుకుగా పాల్గొనేందుకు ఫ్రెంచ్ ఎంటర్‌ప్రైజెస్‌ను లీ స్వాగతించారు. చైనా, ఫ్రాన్స్‌ల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పాటై దాదాపు 60 సంవత్సరాలలో, రెండు దేశాల మధ్య సంబంధాలు ఎల్లప్పుడూ సానుకూల అభివృద్ధిని కొనసాగించాయని, అద్భుతమైన విజయాన్ని సాధించాయని లీ అన్నారు. చైనా-ఫ్రాన్స్ సంబంధాలు స్థిరంగా, ప్రపంచవ్యాప్తంగా ఉంటాయని, రెండు దేశాల వ్యాపారవేత్తలు విశ్వాసాన్ని బలోపేతం చేసుకోవాలని, అవకాశాలను అందిపుచ్చుకోవాలని, మరింత అభివృద్ధిని సాధించేందుకు ఉమ్మడి ప్రయత్నాలు చేయాలని లీ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో చైనా స్టేట్ కౌన్సిల్, స్టేట్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ వు జెంగ్‌లాంగ్ కూడా పాల్గొన్నారు.

గ్రీస్‌లో ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీ

ఏథెన్స్ : గ్రీస్‌లో ఈ నెల 25న జరిగే సాధారణ ఎన్నికల సందర్భంగా రాజధాని ఏథెన్స్‌లో కేకేఈ భారీ ర్యాలీ నిర్వహించింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ గ్రీస్ (కేకేఈ) ఆధ్వర్యంలో జరిగిన ఈ రాజకీయ ర్యాలీకి హాజరయ్యేందుకు సింటాగ్మా స్క్వేర్‌లో బుధవారం సాయంత్రం వేలాది మంది ఏథీనియన్లు హాజరయ్యారు. వీరిలో పురుషులు, మహిళలు, కార్మికులు, విద్యార్థులు, పెన్షనర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. జూన్ 25న జరగున్న పార్లమెంటరీ ఎన్నికలకు ముందు అన్ని పార్టీలతో కూడిన అతిపెద్ద రాజకీయ సభగా ఈ ర్యాలీ నమోదైంది. ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి నిరసనగా అలుపెరగని పోరాటాలు చేయాలని ఈ మహాసభ సంకల్పించింది. ఈ సందర్భంగా న్యూ డెమొక్రసీ (ఎన్‌డీ) పార్టీ అధ్యక్షుడు కీలక సందేశం ఇచ్చారు. అట్టికా ప్రాంతంలో జరిగే ఈ మహాసభకు కేకేఈ సభ్యులు, ఎంపీలు, సెంట్రల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ప్రజలకు సంఘీభావంగా పాటతో ఈ ర్యాలీ ప్రారంభమైంది, కొన్ని రోజుల క్రితం పైలోస్‌లో జరిగిన విషాదకరమైన ఓడ ప్రమాదంలో మరణించిన శరణార్థులు, వలసదారులకు ఈ సమావేశం సానుభూతి ప్రకటించింది. ఈ సమావేశంలో కేకేఈ పార్టీ ప్రధాన కార్యదర్శి డిమిత్రిస్ కొట్సోంబస్ ప్రధాన ప్రసంగం చేస్తూ, రాబోయే ఎన్నికల్లో కేకేఈని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు

పలస్తీనా : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని పలస్తీనా పట్టణంలోకి వందలాది మంది ఇజ్రాయిల్ సెటిలర్లు చొరబడి డజన్ల కొద్దీ కార్లు, ఇళ్లను తగలబెట్టారు. ఈ సంఘర్షణల్లో వెస్ట్ బ్యాంక్ జెనిన్ శరణార్థి శిబిరంలో విద్యార్థిని అంత్యక్రియలను 15 ఏళ్ల సదీల్ నగ్నియే సహవిద్యార్థులు ఖననం చేసిన సంఘటన అత్యంత హృదయ విదార కంగాఉంది. ఇజ్రాయిల్ మిలటరీ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ అంతటా అదనపు బలగాలను మోహరించడంతో ఈ దాడి చేపట్టారు. పలస్తీనా ఇళ్లపై ఇజ్రాయిల్ కాల్పులకు ప్రతిస్పందనగా 1,000 కొత్త సెటిలర్ల గృహాలను నిర్మించే ప్రణాళికలను ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో రోజుల తరబడి జరుగుతున్న ఈ ఘోరమైన కాల్పులు, హింసాకాండల నేపథ్యంలో చేపట్టిన తాజా చర్యలు మరింత ఉద్రిక్తతలను పెంచే ప్రమాదం ఉంది. దాదాపు 400 మంది నిర్వాసితులు పట్టణంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి కార్లు, ఇళ్లు, చెట్లకు నిప్పంటించారని టర్ముస్ అయ్యాలోని నివాసితులు తెలిపారు. దాదాపు 30 ఇళ్లు, 60 కార్లు పాక్షికంగా లేదా పూర్తిగా కాలిపోయాయని మేయర్ లాఫీ అదీబ్ తెలిపారు. ఘర్షణల సమయంలో కనీసం ఎనిమిది మంది పాలస్తీనియన్లు గాయపడ్డారు, సైన్యం రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్‌లను ప్రయోగించింది. ఎలీలో 1,000 కొత్త గృహాలను నిర్మించడానికి ప్రణాళికలను ఆమోదించినట్లు ప్రధాని నెతన్యాహు చెప్పారు. పలస్తీనా-ఇజ్రాయిల్ ఘర్షణల్లో ఈ ఏడాది ఇప్పటివరకు కనీసం 130 మంది పలస్తీనియన్లు మరణించారు. ఇజ్రాయిల్ వెస్ట్ బ్యాంక్‌లో దాదాపు రోజూ రాత్రిపూట దాడులు చేయడం పరిపాటి.

నిర్మాణాత్మకమైన ప్రతిపక్షాలు

కలిసొస్తాయని ఆశిస్తున్నాం

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: పాట్నాలో విపక్షాల సమావేశం నిర్మాణాత్మకంగా ఉంటుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం ఆశాభావం వ్యక్తం చేశారు. దేశాన్ని విపత్తు నుంచి రక్షించడానికి రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని నొక్కి చెప్పారు. మణిపూర్‌లో పరిస్థితిని బీజేపీ తప్పుగా నిర్వహించడాన్ని విమర్శించిన బెనర్జీ, కాషాయ శిబిరం విధానాల వల్లనే ఈశాన్య రాష్ట్రం ఉక్కిరిబిక్కిరి అవుతుందని తెలిపారు. జూన్ 24న అఖిలపక్ష సమావేశానికి పిలుపు ఇవ్వడం 'చాలా ఆలస్యం' అని అన్నారు. 'ఈనెల 24న మన ప్రతిపక్షాల సమావేశం. మంచి జరుగుతుందని, సమష్టి నిర్ణయాలు తీసుకుంటారని ఆశిస్తున్నాం. దేశాన్ని విపత్తు నుంచి కాపాడేందుకు ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేస్తారని భావిస్తున్నాను' అని ఆమె గురువారం విలేకరులతో అన్నారు. మణిపూర్‌పై ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం గురించి అడిగిన ప్రశ్నకు బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభలో ఆ పార్టీ నాయకుడు డెరెక్ ఓబ్రెయిన్ ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. 'ఇప్పుడు చాలా ఆలస్యమైంది. మణిపూర్‌లో పర్యటించడానికి నన్ను అనుమతించాలని నేను కేంద్రాన్ని అభ్యర్థించాను. అయితే అఖిలపక్ష సమావేశం గురించి తెలియజేస్తూ నిన్న నాకు లేఖ వచ్చింది' అని ఆమె చెప్పారు. జాతి హింస కారణంగా 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించడంలో కేంద్రం విఫలమైందని బెనర్జీ అన్నారు.

ఎగవేతదారుల కొమ్ముకాసేలా ఆర్బీఐ సూచన

న్యూఢిల్లీ: రుణాల్ని ఉద్దేశపూర్వకంగా ఎగవేసినవారితో రాజీ పరిష్కారం చేసుకోవాలని బ్యాంకులకు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) జారీచేసిన సూచించిన విధానాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు వినయ్ విశ్వం తీవ్రంగా ఖండించారు. ఇది బ్యాంకింగ్ వ్యవస్థ సమగ్రతను దెబ్బతీస్తుందని, ఎగవేతదారుల సమర్థవంతంగా దారికి తీసుకొచ్చే చర్యలకు అవరోధంగా మారుతుందని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వక ఎగవేతదారులతో బ్యాంకులు వన్-టైమ్ సెటిల్‌మెంట్‌కు అనుమతించే ఆర్బీఐ సర్క్యులర్ దేశంలోని ఆర్థిక సంస్థల స్థిరత్వానికి గణనీయమైన ప్రమాదం కలిగిస్తుందన్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు గురువారం వినయ్ విశ్వం ఒక లేఖ రాశారు. రుణాలను ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టిన వ్యక్తులు, సంస్థలకు సున్నితమైన పరిష్కార నిబంధనలను అందించడం ద్వారా, బాధ్యతాయుతమైన రుణగ్రహీతల జవాబుదారీతనం ప్రాథమిక సూత్రాలను ఈ సర్క్యులర్ బలహీనపరుస్తుందన్నారు.

"ఉద్దేశపూర్వక ఎగవేతదారులతో వన్-టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్)లోకి ప్రవేశించడానికి బ్యాంకులను అనుమతిస్తూ ఆర్బీఐ జారీ చేసిన సర్క్యులర్‌కు సంబంధించి నా తీవ్ర భయాందోళనలను వ్యక్తపరచడానికి ఈ లేఖను మీకు రాస్తున్నాను. ఈ సర్క్యులర్ మన ఆర్థిక సంస్థల స్థిరత్వానికి గణనీయమైన నష్టాలను కలిగిస్తుంది" అని ఆ లేఖలో విశ్వం పేర్కొన్నారు. అటువంటి చర్య "మన బ్యాంకింగ్ రంగంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడమే కాకుండా నిర్లక్ష్యపు రుణాలు, ఉద్దేశపూర్వక ఎగవేతలను ప్రోత్సహించడం ద్వారా నైతిక ప్రమాదాన్ని కూడా సృష్టిస్తుంది" అని హెచ్చరించారు. "రుణాలను ఉద్దేశపూర్వకంగా ఎగవేసే వారు తమ బకాయిలను వన్-టైమ్ పేమెంట్ ద్వారా సెటిల్ చేయడానికి అనుమతించడం బ్యాంకింగ్ వ్యవస్థ సమగ్రతను దెబ్బతీయడమే కాకుండా శిక్షించని సంస్కృతిని శాశ్వతం చేస్తుంది. ఈ విధానం ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్న నిజమైన రుణగ్రహీతలు, ఉద్దేశపూర్వకంగా తిరిగి చెల్లించే వారి మధ్య తేడాను గుర్తించడంలో విఫలమవుతుందన్నారు. "సులభంగా తప్పించుకోవడానికి ఒక మార్గాన్ని కల్పించడం వల్ల తిరిగి చెల్లించే బాధ్యతలను శ్రద్ధగా నెరవేర్చే నిజాయితీ గల రుణగ్రహీతలకు అన్యాయం చేయడంతో పాటు ప్రతికూలత కలిగిస్తుంది. అందువల్ల మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి, స్థిరత్వాన్ని దోచుకునే బాధ్యతగల రుణగ్రహీతల హక్కులు, ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరం" అని ఆ లేఖలో విశ్వం పేర్కొన్నారు.

ఇటీవలి సంవత్సరాలలో రైట్-ఆఫ్‌లు, టెక్నికల్/ప్రుడెన్షియల్ రైట్-ఆఫ్‌లు/రియాలిటీ కారణంగా ఎన్‌పీఏల తగ్గింపులో గణనీయమైన పెరుగుదల ఉందని ఆర్బీఐ ప్రశ్నకు ప్రభుత్వ ప్రతిస్పందనను కూడా ఆయన ఉటంకించారు. 'రైట్-ఆఫ్ పరిమాణం గణనీయంగా పెరిగిందని స్పష్టంగా తెలుస్తోంది, తద్వారా ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు వ్యతిరేకంగా జవాబుదారీతనం,నిరోధాన్ని ప్రోత్సహించడంలో ఇటువంటి చర్యల ప్రభావం గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఉద్దేశపూర్వకంగా ఎగవేతదారులను సెటిల్మెంట్లు చేయడానికి అనుమతించడం వలన బకాయి ఉన్న రుణ మొత్తాన్ని తగినంతగా రికవరీ చేయలేరు, వారి చర్యలకు వారిని బాధ్యులుగా ఉంచే సూత్రాన్ని బలహీనపరుస్తుంది" అని విశ్వం తెలిపారు. ఆర్బీఐ తీసుకున్న చర్య ప్రస్తుత రికవరీ యంత్రాంగాల ప్రభావం, ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు ఓటీఎస్‌ని పొందేందుకు అనుమతించడం వెనుక ఉన్న నిజమైన ఉద్దేశాల గురించి తీవ్రమైన సందేహాలను లేవనెత్తుతోందని ఆ లేఖలో వినయ్ విశ్వం పేర్కొన్నారు.

పోలవరం అక్రమ తవ్వకాలపై

కౌంటర్ దాఖలు చేయండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం కాలువ అక్రమ తవ్వకాల వ్యవహారంపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పోలవరం కాలువ తవ్వకాలతో 800 కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ జరిగిందంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై గురువారం ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. విచారణలో భాగంగా ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, చీఫ్ ఇంజనీర్ నారాయణరెడ్డిలను గతంలోనే వ్యక్తిగతంగా హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, చీఫ్ ఇంజనీర్ నారాయణరెడ్డి గురువారం న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. పెద్దఎత్తున అక్రమ మైనింగ్ జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పిటిషనర్ తరపు న్యాయవాది పాలేటి మహేశ్ హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను హైకోర్టు మూడు వారాలకు వాయిదా వేసింది.

ఉమ్మడి వ్యూహం

(మొదటిపేజీ తరువాయి)

చెందుతున్నట్లు కనిపించడం లేదు. సరైన ప్రాధాన్యతలు లేకుండాఇక్కడ లోక్‌సభ ఎన్నికలకు సన్నాహాలు నిజంగా అవసరమైన మార్పును తీసుకువస్తాయా?' అని మాయావతి ప్రశ్నించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల సన్నాహాలు దృష్టిలో ఉంచుకుని, స్పష్టమైన ఉద్దేశాలతో ప్రజల్లో సాధారణ విశ్వాసాన్ని నింపేందుకు ఈ పార్టీలు ప్రయత్నించి ఉంటే బాగుండేదని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. 'ముహ్ మే రామ్ బగల్ మే ఛూరీ' (ముఖం మీద ప్రశంసలు, వెనుక భాగంలో పొడిచే) ఎంతకాలం ఉంటుంది?' అని ఆమె పేర్కొన్నారు. 'ముందుగా నిర్ణయించిన కుటుంబ కార్యక్రమం' కారణంగా తాను సమావేశానికి హాజరు కాలేనని ఆర్‌ఎల్‌డీ నాయకుడు చౌదరి తెలిపారు. గురువారం ఆర్‌ఎల్‌డీ అధికారిక ట్విట్టర్ హ్యాండిల్‌లో పంచుకున్న నితీశ్‌కు రాసిన లేఖలో చౌదరి ఇలా అన్నారు. 'నిరంకుశ, మతతత్వ శక్తులు దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక సామరస్యానికి ముప్పు తెస్తున్నాయి. ఈ సమయంలో ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశంలోని ముఖ్యమైన సమస్యలు, సవాళ్లను చర్చించడం ద్వారా మనం ప్రతిపక్షం ప్రజల ముందు ఒక సుదూర, ఆచరణాత్మక ప్రణాళికను ప్రదర్శించాలి' అని పేర్కొన్నారు. 'ఈ విధంగా యువత, మహిళలు, రైతులు, సమాజంలోని వెనుకబడిన వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా మనం కలిసి దేశంలో అర్థవంతమైన మార్పును తీసుకురాగలము' అని ఆయన అన్నారు. సమావేశం విజయవంతం కావాలని ఆర్‌ఎల్‌డీ అధ్యక్షుడు శుభాకాంక్షలు తెలుపుతూ, 'ఈ సమావేశంలో ప్రతిపక్ష ఐక్యత మార్గంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిరూపిస్తుందని నేను కచ్చితంగా అనుకుంటున్నాను' అని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించేందుకు శుక్రవారం పాట్నాలో జరిగే సమావేశంలో ప్రతిపక్ష పార్టీల అగ్ర నేతలు మేధోమథనం చేయనున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తదితరులు హాజరయ్యే అవకాశం ఉంది.

ఐక్య ఉద్యమాలు

(మొదటిపేజీ తరువాయి)

తప్ప, ప్రజలపై జరుగుతున్నా అఘాయిత్యాలపై స్పందించడం లేదన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ పెరిగిన నేరాల రేటును తగ్గించేందుకు పోలీసులు కొత్త విద్య నేర్చుకున్నారని చెప్పారు. దళితులు, పేద వర్గాలపై దాడులు చేసి, డబ్బులిచ్చి మధ్యవర్తిత్వం చేస్తున్నారని ఆరోపించారు. సచివాలయాల్లో మహిళా పోలీసుల ఏమి చేస్తున్నారని నిలదీశారు. స్వామిల ఆశ్రమాలు ఆడపిల్లలపై అఘాయిత్యాలకు కేంద్రాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ పోలీసులే రౌడీలుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నిర్భిన్న వాతావరణం నెలకొందన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు సరిగా పని చేయడం లేదన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ అంటూనే అవమానకరంగా మాట్లాడుతున్నారని తెలిపారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒక్క నెలలో 7 హత్యలు జరిగాయని తెలిపారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు, అట్రాసిటీ కేసులు గురించి సీఎం సమీక్ష చేయటం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లు సరిగా పని చేయటం లేదని విమర్శించారు. రాజధాని దళిత జేఏసీ నాయకులు పోతుల బాలకోటయ్య మాట్లాడుతూ వైసీపీ ఇంటికి పంపించాలంటే ప్రతిపక్ష పార్టీలు దళిత బహుజనులను దగ్గరకు తీసుకోవాలన్నారు. రాసన్న రోజుల్లో వైఎస్ అవినాశ్ రెడ్డిని హత్య చేసినా ఆశ్చర్యం లేదన్నారు. వీసీకే రాష్ట్ర అధ్యక్షులు ఎన్.జె.విద్యాసాగర్ మాట్లాడుతూ అత్యాచారాలు, హత్యలు చేసిన వారు పారిపోకుండా పోలీస్ స్టేషన్‌కు వెళుతున్నారని, రాష్ట్రంలో కొత్త ధోరణి నడుస్తోందన్నారు. ప్రత్యేకమే కాశ్మీర్ ఫైల్స్, ఆదిపురుష్ వంటి సినిమాలు తీయించి ఒక భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళుతోందని అన్నారు. తెలుగు మహిళా నాయకులు చెన్నుపాటి ఉషారాణి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.రామకృష్ణ, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.కె.ఖాదర్ బాషా, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు కొరివి వినయ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.మధు, ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అశోక్, బీసీ సంక్షేమ సంఘం ఎస్టీఆర్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి అఫ్జర్, ఐద్వా నాయకులు డి.శ్రీనివాసకుమారి, టీడీపీ నాయకులు వెలగపూడి రామకృష్ణ ప్రసంగించారు. ముందుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సభ్యులు మార్పులు చేర్పులు అనంతరం సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. జూన్ 27న 26 జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. అనంతరం గవర్నర్ అపాయింట్‌మెంట్ తీసుకుని ఆయనకు వినతి పత్రం అందజేయాలని నిర్ణయించారు. ముందుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్‌ఎన్ మూర్తి అతిథులను పరిచయం చేసి రౌండ్ టేబుల్ సమావేశం ఉద్దేశాన్ని వివరించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య ఆధ్వర్యంలో గీతాలు ఆలపించారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రా నాయక్, సీపీఐ కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జ్ కార్యదర్శి టి.తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

భారత జీడీపీ వృద్ధి 6.3శాతం ఉండొచ్చు: ఫిచ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023-24) భారత జీడీపీ వృద్ధి 6.3 శాతంగా ఉండవచ్చని ప్రముఖ రేటింగ్ సంస్థ ఫిచ్ అంచనా వేసింది. గతంలో 6శాతంగా ఉండవచ్చని అంచనా వేసిన ఆ సంస్థ... దానిని 6.3 శాతానికి సవరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మెరుగైన వృద్ధి, స్వల్పకాలంలో వృద్ధికి అవకాశాలు మెరుగ్గా ఉండడం వంటి కారణాలతో అంచనాలను సవరిస్తున్నట్లు పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 7.2 శాతంగా నమోదైంది. అంతకుముందు ఏడాది 9.1 శాతం వృద్ధిని భారత్ నమోదు చేసింది. ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో భారత జీడీపీ 6.1 శాతం వృద్ధి నమోదైంది. జనవరి-మార్చి త్రైమాసికంలో అనుకున్న దానికంటే మెరుగైన వృద్ధి నమోదైందని రేటింగ్ ఏజెన్సీ తెలిపింది. ఇటీవలి కాలంలో ఆటో సేల్స్, పీఎంఐ సర్వేలు, రుణాల్లో మెరుగైన వృద్ధి నమోదవుతోందని తెలిపింది. అందుకే 2023-24 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాలను 0.3 శాతం మేర పెంచుతున్నట్లు ఫిచ్ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాలను ఫిచ్ గతంలోనూ సవరించింది. తొలుత 6.2 శాతం మేర వృద్ధి నమోదు చేస్తుందన్న ఫిచ్... తర్వాత దాన్ని 6 శాతానికి కుదించింది. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న వడ్డీ రేట్లను అందుకు కారణంగా చూపింది. అదే సంస్థ ఇప్పుడు వృద్ధి అంచనాలను సవరించింది. ఇక 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో భారత్ 6.5 శాతం చొప్పున వృద్ధి నమోదు చేసే అవకాశం ఉందని ఫిచ్ వెల్లడించింది.

11 సర్టిఫికెట్ల జారీ ఉచితం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించి తక్షణమే జారీ చేయాలని ఆదేశించారు. మొత్తం 11 రకాల సర్టిఫికెట్లను జారీ కోసం నిర్వహించే ఈ క్యాంపుల్లో ఇప్పటి వరకూ తీసుకుంటున్న యూజర్ చార్జీలను సైతం రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జగనన్న సురక్ష కింద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు కోరే వారికి కుల, నివాస, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ వంటి మొత్తం 11 సర్టిఫికెట్లకు ఎటువంటి చార్జీలు లేకుండా అందించాలని ఉత్తర్వుల్లో వెల్లడించింది. అంటే దాదాపు 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగానే ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు జీఓఆర్‌టీ నెంబరు 10ని ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది.

విద్యార్థి బరువులో స్కూల్ బ్యాగ్ బరువు 15శాతం మించరాదు

బెంగళూరు: విద్యార్థులు పాఠశాలకు తీసుకెళ్లే బ్యాగు బరువు విషయంలో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం విద్యార్థి బరువులో బ్యాగు బరువు 15 శాతానికి మించి ఉండకూడదని పేర్కొంది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు స్కూల్ బ్యాగ్ మార్గదర్శకాలను పాటించాలని కోరిన కర్ణాటక ప్రభుత్వం.. దీనికి సంబంధించిన ఉత్తర్వులను బుధవారం జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలని బ్లాక్ స్థాయి విద్యాధికారులను కోరింది. ఈ సర్క్యులర్ ప్రకారం.. స్కూల్ బ్యాగ్ గరిష్ఠ బరువు విద్యార్థి బరువులో 15 శాతానికి మించకూడదు. 1-2 తరగతి పిల్లల బ్యాగులు 1.5-2 కిలోలు, 3-5 తరగతి పిల్లల బ్యాగులు 2-3 కిలోల బరువు ఉండాలి. 6-8 తరగతులు, 3-4 కిలోలు, 9-10 తరగతులకు 4-5 కిలోలు ఉండాలి. పాఠశాలలు వారానికి ఒకసారి, ముఖ్యంగా శనివారాల్లో 'నో బ్యాగ్ డే' జరుపుకోవాలని సర్క్యులర్‌లో ప్రభుత్వం పేర్కొంది. డాక్టర్ వీపీ నిరంజనారాధ్య కమిటీ సిఫారసుల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. స్కూల్ బ్యాగ్ బరువుల వలన కలుగుతున్న పాఠశాల విద్యార్థులకు కలిగే ఆరోగ్య ప్రభావాలను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. కొన్నేళ్ల క్రితం ఏర్పాటైన ఈ కమిటీ 2018-19లో తుది నివేదికను సమర్పించింది. 2019లో ఈ కమిటీ తన నివేదిక సమర్పించినప్పుడు స్కూల్ బ్యాగ్ బరువు పిల్లల బరువులో 10 శాతానికి మించకుండా చూడాలని కర్ణాటక ప్రభుత్వం పాఠశాలలను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే దానిని ఇప్పుడు తిరిగి జారీ చేస్తూ.. విద్యార్థి బరువులో 15 శాతానికి మించి ఉండకూడదని పేర్కొంది. విద్యార్థులు ప్రతిరోజూ తీసుకెళ్లే భారీ స్కూల్ బ్యాగులు సమస్యను పరిష్కరించే ప్రయత్నాలను అభివృద్ధి చేస్తామని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించింది. పిల్లల హెవీ స్కూల్ బ్యాగుల గురించి అడిగిన ప్రశ్నలకు బీఐఎస్ డైరెక్టర్ జనరల్ సమాధానమిస్తూ.. సంస్థ పరిశోధన చేస్తుందని, త్వరలో దీనికి సంబంధించిన ప్రమాణాలను సిద్ధం చేస్తుందని పేర్కొన్నారు.

మణిపూర్ బృందానికి అవకాశం ఇవ్వని మోదీ

ఈ నెల 10 నుంచి ఢిల్లీలోనే ఉన్న బృందం.

ఫలించని ఎదురుచూపులు

న్యూఢిల్లీ : కేంద్ర, రాష్ట్ర బీజేపీ ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఈశాన్య రాష్ట్రం మణిపూర్ తీవ్ర అల్లర్లకు కేంద్ర బిందువైంది. నెలకు పైగానే కొనసాగుతున్న అల్లర్లు తీవ్ర రూపం దాల్చి హింసాత్మకంగా మారాయి. రాష్ట్రంలో పరిస్థితులు చేయి దాటాయి. దీంతో శాంతి భద్రతల పరిరక్షణకు కేంద్ర బలగాలను రంగంలోకి దింపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే, ఈ విషయంలో ప్రధాని మోదీ నోటి నుంచి ఇప్పటి వరకూ ఒక్క మాట కూడా వెలువడలేదు. దీంతో ప్రధాని తీరుపై ఇప్పటికే సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో ప్రధానిని కలవాలని మణిపూర్ నుంచి పది పార్టీలకు చెందిన ప్రతినిధి బృందం ప్రయత్నించింది. ఆయనను కలవటం కోసం ఈ బృందం ఈ నెల 10 నుంచి దేశ రాజధానిలోనే ఉన్నది. కానీ, మోదీ మాత్రం మణిపూర్ ప్రతినిధి బృందానికి కలవ డానికి అవకాశం ఇవ్వకుండానే అమెరికా పర్యటనకు వెళ్లిపోయారు. దీంతో మోదీ తీరుపై ఈ ప్రతినిధి బృందం అసంతృప్తిని వ్యక్తం చేసింది.

ప్రధానికి ఇది నిమిషాల సమయం కూడా లేదా? అని మాజీ సీఎం ఇబోబి సింగ్ ప్రశ్నించారు. మణిపూర్ అల్లర్లతో ఆ రాష్ట్రంలో వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 60 వేల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. రాష్ట్రంలో ఇప్పటికీ శాంతియుత పరిస్థితులు పునరుద్ధరణ కాలేదు. ఇలాంటి తరుణంలో ఇక్కడి పరిస్థితిపై కలవడానికి మోదీ నిరాకరించటంపై మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు ఇబోబి సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ పట్ల ఇలా ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు.

తాము కోరుకున్నది సాధారణ స్థితిని పునరుద్ధరించటం మాత్రమే అని చెప్పారు. "మాకు విలువ లేదని మేము భావిస్తున్నాం. మేము దేనిని అడుక్కోవడానికి రాలేదు. మేము యాచకులం కాదు. మా ప్రజలు చనిపోతున్నారు. మా రాష్ట్రం కాలిపోతున్నది. మేము శాంతిని కోరుకుంటున్నాం. కానీ ప్రధానికి మా కోసం ఐదు నిమిషాల సమయం లేదు" అని ఆయన అన్నారు.

మణిపూర్ మండుతుంటే మోదీ విదేశాలకా? : దిగ్విజయ్ సింగ్

న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్ అల్లర్లతో అట్టుడుకుతుంటే ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనకు వెళ్లి యోగాసనాలు వేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాక్‌కు చెందిన లష్కరే ఉగ్రవాది, 2008 ముంబై దాడుల నిందితుడు సాజిద్ మిర్‌ను అంతర్జాతీయ టెర్రరిస్ట్‌గా ప్రకటించే ప్రతిపాదనను చైనా వ్యతిరేకిస్తుంటే ప్రధాని మోదీ విదేశీ పర్యటనలో బిజీగా గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించిన ఘటనను ఇది గుర్తుకు తెప్పిస్తోందని ట్విట్టర్ వేదికగా దిగ్విజయ్ సింగ్ మోదీపై విమర్శలు గుప్పించారు. మణిపూర్ అల్లర్లలో ఇప్పటివరకూ 100 మందికి పైగా మరణించారని, ఇప్పటికీ రాష్ట్రంలో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా ప్రధాని మోదీ మౌనం దాల్చారని, మణిపూర్ భగ్గుమంటుంటే అమెరికా పర్యటనకు వెళ్లారని ఆక్షేపించారు. గత తొమ్మిదేళ్లుగా ప్రధాని పనితీరు పేలవంగా ఉందని, అందుకే మోదీ తనను మార్కెటింగ్ చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అద్వానీ చెప్పినట్టు మోదీ గొప్ప ఈవెంట్ మేనేజర్ అని దిగ్విజయ్ వ్యాఖ్యానించారు. గత తొమ్మిదేండ్లలో తనను తాను గొప్పగా ప్రమోట్ చేసుకోవడం మినహా అన్ని రంగాల్లో మోదీ విఫలమయ్యారని అన్నారు. మణిపూర్ మండుతుంటే ప్రపంచ దర్శనానికి బయలుదేరిన ప్రధాని గురించి ఏం చెబుతాము అని మరో ట్వీట్‌లో దిగ్విజయ్ సింగ్ ప్రశ్నించారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, అవినీతి పాలనతో రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. గురువారం స్థానిక వంక సత్యనారాయణ స్వరాజ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ, ప్రజలకు తీరని నష్టం కలిగిస్తున్నారని అన్నారు. మోదీ గత ఎన్నికల సందర్భంగా తాను అధికారంలోకి రాగానే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తానని చెప్పి రైతులను మోసం చేశాడని ధ్వజమెత్తారు. జాతీయ ప్రాజెక్టుగా గుర్తింపు పొందిన పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, లక్షా 6,600 మంది నిర్వాసిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎప్పటికప్పుడు ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ, ప్రభుత్వాలు చేసే కొన్ని సంక్షేమ పథకాలను అభినందిస్తూ మరింత మెరుగైన పాలన అందించాలని ఆశించిందన్నారు. నాలుగు సంవత్సరాల రెండు మాసాలు అయినప్పటికీ సంక్షేమ పథకాలు పేరు మార్చి బటన్ నొక్కే కార్యక్రమాలు తప్ప రాష్ట్రంలో అభివృద్ధిని ఆటకెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రగతికి చిహ్నాలుగా నిలిచే రహదారులు అధ్వానంగా మారాయని, పల్లెలను అనుసంధానం చేసే రోడ్లు గోతులతో దర్శనమిస్తూ చెరువులను తలపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ ట్రూ అప్, సర్వీసు, ఇంధన చార్జీల పేరుతో అదనపు భారాలు వేసి స్మార్ట్ మీటర్లతో రైతులను నాశనం చేయడానికి కుట్ర చేస్తున్నారని, సర్దుబాటు పేరుతో వినియోగదారులపై భారం వేస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అదానీ సంస్థలతో సోలార్ విద్యుత్, అలాగే స్మార్ట్ మీటర్ల సరఫరాపై చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను సమీక్షించి రద్దు చేసి ముఖ్యమంత్రి తన చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలని హితవు పలికారు. గత నెలలో సీపీఐ అధ్వర్యంలో ప్రాజెక్టులు సందర్శించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రాజెక్టు నిర్మాణాలను తక్షణం చేపట్టాలని డిమాండ్ చేసిందని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ గ్రామాన ప్రజలకు వద్దకు వెళ్లి స్థానిక సమస్యలను అధ్యయనం చేసి, వాటి మీద ఆందోళన చేపట్టి పరిష్కారం సాధించేలా ఉద్యమాలను ముందుకు తీసుకువెళతామని చెప్పారు. ఈ సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, సిహెచ్ రంగారావు, రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీపీఐ శిక్షణా తరగతులు

సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. వంక సత్యనారాయణ స్వరాజ్య భవనంలో రెండవ రోజు జరిగిన శిక్షణా తరగతుల్లో ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో పేదలపై పన్నుల రూపంలో భారాలు వేస్తున్నారని విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమ సుందర్ 'భారతదేశ చరిత్ర-సంస్కృతి' అనే అంశం బోధించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు 'పశ్చిమ గోదావరి జిల్లా అభివృద్ధి, సీపీఐ వైఖరి-భవిష్యత్ కార్యాచరణ' అనే అంశాన్ని బోధిస్తూ జిల్లాలో సీపీఐ ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ భవిష్యత్ ప్రణాళిక రూపొందించి, పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

28న కురుపాంలో సీఎం జగన్ పర్యటన ఖరారు

విశాలాంధ్ర-పార్వతీపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 28న పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంను సందర్శించనున్నారు. అక్కడ రాష్ట్రస్థాయి అమ్మఒడి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయడంలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. సీఎం పర్యటిస్తున్నది మన్యం ప్రాంతం కావడంతో భద్రతాపరంగా పెద్ద ఎత్తున చర్యలు చేపడుతున్నారు. రోడ్ల మరమ్మతులు, హెలిపాడ్ నిర్మాణం, బహిరంగసభ ఏర్పాట్లు, జన సమీకరణ తదితర అంశాలను క్షుణ్ణంగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. సీఎం హెలిపాడ్ నుండి సమావేశం జరిగే సభాస్థలికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ఉండటంతో రోడ్ షో ఉంటుందని, దీనికోసం కూడా జన సమీకరణ చేయడంలో అధికారులు, వైసీపీ నేతలు నిమగ్నమైనట్లు తెలిసింది. రానున్న ఎన్నికల దృష్ట్యా కురుపాం-చిన మేరంగి మధ్యలో ఒక ప్రైవేటు స్కూల్ ఆవరణలో జరగనున్న సీఎం సభను వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఆయన భార్య, కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణిలు ప్రత్యేక దృష్టి సారించారని సమాచారం. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం, జనసమీకరణపై వారు ప్రధాన దృష్టి సారించారని స్పష్టంగా తెలుస్తోంది. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఆయన కార్యక్రమాన్ని పరిశీలించే తలశిల రఘురాం... గురువారం రాత్రికి పార్వతీపురం జిల్లా కేంద్రానికి చేరుకొని, శుక్రవారం కురుపాం సభాస్థలిని జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి పరిశీలిస్తారని జిల్లా అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే అధికార పార్టీ కీలకనేతలు, అధికారులు జిల్లా కేంద్రానికి చేరుకొని పర్యవేక్షణ చేస్తున్నారు.

ఏపీని అప్పుల కుప్పగా మార్చిన జగన్

- రాష్ట్రంలో ప్రతి ఒక్కరి తలపై రూ.2 లక్షల అప్పు
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: ఆంధ్ర ప్రదేశ్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అప్పుల కుప్పగా మార్చారని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరి తలపై రూ.2 లక్షల అప్పు ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిశితంగా విమర్శించారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి రూ.96 వేల కోట్ల అప్పు లభించిందని, అనంతరం చంద్రబాబు నాయుడు ఐదేళ్ల పాలనలో మరో లక్షా 53 వేల అప్పుతో 26 వేల కోట్ల రూపాయల అప్పు రాష్ట్రానికి ఉందని తెలిపారు. సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో మరో రూ.8 లక్షల కోట్ల అప్పు తీసుకురాగా మొత్తం ప్రస్తుతం రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్ల పైనే అప్పు ఉందన్నారు. ఇన్ని లక్షల కోట్ల రూపాయల అప్పు తీసుకొచ్చినా, రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పూర్తి చేశారా, ప్రాజెక్టు నిర్వాసిత ప్రజలకు పునరావాస ప్రయోజనాలు చేకూర్చారా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 70 శాతం ప్రాజెక్టు పనులు పూర్తయితే, ఈ నాలుగేళ్లలో ఎంత మేర పూర్తయిందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 45 మీటర్ల ఎత్తు ఉండాల్సిన ప్రాజెక్టును 41.5 మీటర్లకు మార్పు చేస్తే 22 మంది లోక్‌సభ సభ్యులు, 8 మంది రాజ్యసభ సభ్యులు ఉన్న వైసీపీ ప్రభుత్వం కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని రావుల అన్నారు. ఈ విధంగా అయితే పోలవరం ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంగా మారే ప్రమాదం ఉందన్నారు. డిజైన్ కనుగుణంగా ప్రాజెక్టు నిర్మాణం జరిగితే లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. దీంతో పాటు అనేక కర్మాగారాలకు నీరు సరఫరా అవుతుందని, ప్రస్తుతం ఉన్న ఎత్తు ప్రకారమైతే రాష్ట్ర ప్రయోజనాలు శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. స్వంత ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధిని, ప్రజల సౌభాగ్యాన్ని తాకట్టు పెట్టారనే అనుమానాలు ప్రజలకు కలుగుతున్నాయన్నారు. ఇన్ని లక్షల కోట్ల రూపాయల అప్పు చేసి రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు అయినా నిర్మాణం పూర్తి చేశారా? అభివృద్ధి కార్యక్రమాలు చేశారా? అని ప్రశ్నించుకుంటే ఎలాంటి సమాధానాలు లభించవన్నారు. సంక్షేమ పథకాలకు రెండు లక్షల కోట్ల రూపాయలే ఖర్చు చేసిన ప్రభుత్వం మిగిలిన దానితో దుబారా చేసిందా అని ప్రశ్నించారు. విద్యుత్ సంస్కరణలకు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే వ్యతిరేకత లభించగా మన రాష్ట్రంలో ఎందుకు ఆమోదం తెలిపారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. మరోవైపు గత దశాబ్ద కాలంగా రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెరగలేదని, అయితే వైసీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో మూడుసార్లు చార్జీలు పెంచడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు విద్యుత్ పెనుభూతంగా మారేలా ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం అఖిలపక్షాన్ని ముఖ్యమంత్రి కేంద్రం వద్దకు ఎందుకు తీసుకు వెళ్లలేకపోతున్నారని ప్రశ్నించారు. ఈ విధంగా రాష్ట్రం చేస్తున్న అప్పుల వల్ల ప్రజల జీవితాలు చీకటిమయం కావటమే కాకుండా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. ఇలాంటి తరుణంలో ఈ ప్రభుత్వానికి తగిన సమయంలో ప్రజలే తగిన గుణపాఠం నేర్పాలని పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.మాలకొండయ్య, నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్ బాబు, ఏఐటీయూసీ కందుకూరు డివిజన్ కార్యదర్శి వై.ఆనందమోహన్, ఏఐవైఎఫ్ కందుకూరు డివిజన్ కార్యదర్శి చంద్రమోహన్ పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీని గద్దె దించాలి

సీపీఐ రాష్ట్ర నాయకులు ఏజే స్టాలిన్ పిలుపు

విశాలాంధ్ర - విశాఖ: కేంద్రం లో అధికారంలో ఉన్న మతతత్వ బీజేపీని 2024 లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గద్దె దించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర నాయకులు ఏజే స్టాలిన్ పిలుపునిచ్చారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ, సమితి సమావేశాలు గురువారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం, విద్యుత్ ఛార్జీల పెంపుపై నిరసన కార్యక్రమాలు, రాష్ట్రంలో శాంతి భద్రతలు.. తదితర అంశాలపై ప్రధానంగా చర్చించి అనేక నిర్ణయాలు చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మరోమారు అధికారంలోకి వస్తే దేశం విపత్కర పరిస్థితుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికే మతాలు, వర్గాలు మధ్య వైషమ్యాలను సృష్టించి పరిపాలన సాగిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో వైసీపీ పాలన గాడి తప్పిందని విమర్శించారు. ప్రశాంతతకు నిలయంగా పేరొందిన విశాఖ నగరం నేడు హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు, మత్తు పదార్థాలకు నిలయంగా మారిందన్నారు. జీవీఎంసీ మేయర్‌కు ఉన్న అధికారాలను వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్చార్జి సుబ్బారెడ్డి తీసుకుని, పెత్తనం చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు మాట్లాడుతూ పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గత సమావేశం నుంచి నేటి వరకు నిర్వహించిన కార్యక్రమాల నివేదికను వివరించారు. జ్ఞానానంద స్వామీజీ ఆశ్రమం వద్ద లైంగిక ఆందోళన చేస్తున్న మహిళా నాయకురాలిపై చేయి చేసుకున్న ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఎస్ ఐ దివ్యజ్యోతిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్‌కి శుక్రవారం ఫిర్యాదు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా సమితి సభ్యులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక సహాయకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: రాష్ట్రంలో ఖాళీగా 4765 పశు సంవర్ధక సహాయకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు డిమాండ్ చేశారు. కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డి భవన్ లో గురువారం ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, ఇతర నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 4765 పశుసంవర్ధక సహాయకుల పోస్టులను భర్తీ చేసేందుకు సీఎం జగన్ మోహన్ రెడ్డి, ఆర్థికశాఖ అనుమతి ఇచ్చినప్పటికి సంబంధిత అధికారులు కొత్తగా క్లస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి 3 నుంచి 5 రైతు భరోసా కేంద్రాలను ఒక క్లస్టర్

గా ఏర్పాటు చేశారన్నారు. దీని ద్వారా భరోసా కేంద్రాల్లో పోస్టులు మిగులుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. తద్వారా రాష్ట్రంలో గత 3 ఏళ్ల నుండి డైరీ ఒకేషనల్, డైరీ డిప్లొమో చదివిన అభ్యర్థులు సుమారు 50 వేల మంది నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం 3 వ నోటిఫికేషన్ వస్తుందని కోచింగ్ సెంటర్లకు మూడేళ్లుగా వేలాది రూపాయలు ఖర్చుపెట్టి నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోస్టుల భర్తీలో మొండి వైఖరిని వీడకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నెల 27 నుండి 30 వరకు గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న సాంస్కృతిక సమ్మేళన కార్యక్రమాలలో జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు మేధావులు, కవులు,కళాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో దేశంలో అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులు, రాజకీయాల్లో జరుగుతున్న మార్పులు, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువత పట్ల వ్యవహరిస్తున్న నిరంకుశ వైఖరి పై భవిష్యత్ పోరాట కార్యాచరణ నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని ఈ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి మోహన్ కృష్ణ, రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి దనుజయ్, నగర అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు లిఖిల్, నాయకులు పురుషోత్తం, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర'

అధికారులకు సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'ఆడుదాం ఆంధ్ర' పేరిట నిర్వహించే క్రీడా సంబరాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారు. దీనిపై తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎం జగన్ సమీక్షించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్రీడాకారుల్లో చక్కటి స్ఫూర్తిని నింపేలా ఆటల పోటీలు సాగాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీయడానికి ఇవి దోహదపడాలన్నారు. పోటీలకు వచ్చే క్రీడాకారులకు మంచి భోజనం సహా ఇతర సదుపాయాలు అందేలా చూడాలని, పోటీలను సమర్థంగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే రాష్ట్రానికి చెందిన ప్రముఖ క్రీడాకారులంతా ఈ పోటీల్లో భాగస్వామ్యం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో క్రికెట్ సహా ఇతర క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నంలో మరో అత్యాధునిక క్రికెట్ స్టేడియం దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఇది సాకారం అయ్యాక ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న వైయస్సార్ స్టేడియంను.. క్రీడలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దేదిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి చెన్నై సూపర్ కింగ్స్ ముందుకు వచ్చిందని, కడప, తిరుపతి, మంగళగిరి, విశాఖపట్నంలలో క్రికెట్ అకాడమీల ఏర్పాటు దిశగా ముందుకు సాగాలని సీఎం అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, క్రీడలు, యువజన సర్వీసులశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జీ వాణీమోహన్, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్.గుల్జార్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, శాప్ వీసీ అండ్ ఎండీ కె హర్షవర్ధన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పూర్ణానంద స్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన పూర్ణానంద స్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏపీ మహిళా సమాఖ్య అధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలపై వరుసగా అత్యాచారాలు, దాడులు జరుగుతున్నా ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేదని విమర్శించారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చినా వాటిని పటిష్టంగా అమలు చేయకపోవడంతో మహిళలపై దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పూర్ణానంద స్వామీజీ ఆశ్రమంలోని లొసుగులను వెలికి తీయాలని, స్వామీజీని కఠినంగా శిక్షించాలని కోరుతూ విశాఖలో మహిళా సమాఖ్య అధ్వర్యంలో ధర్నా చేస్తున్న మహిళా కార్యకర్తలను పోలీసులు నేరస్తులను చూసినట్లు చూస్తూ ఇష్టం వచ్చినట్లు కొట్టడం చూస్తే వీరు రక్షక భటులా? లేక ఖాకీ ముసుగులో ఉన్న వీధి రౌడీలా? అనే అనుమానం కలుగుతోందన్నారు.

వైసీపీ ప్రభుత్వం ప్రజల్ని వంచిస్తోంది

సంక్షేమం ముసుగులో హక్కుల్ని కాలరాస్తున్నారు
జనసేన అధినేత పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర బ్యూరో కాకినాడ/అమలాపురం: వైసీపీ ప్రభుత్వం సంక్షేమం ముసుగులో ప్రజల హక్కులను కాలరాస్తోందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ని సవ్యంగా అమలు చేస్తే అసలు నవరత్నాలతో అవసరం ఏముంది? అని ప్రశ్నించారు. సబ్ ప్లాన్‌ని ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం వద్ద నిధులన్నా ప్రజలకు మంచి చేయాలన్న మనసు పాలకులకు లేదని చెప్పారు. దీనిపై పార్టీలకు, కులాలకు అతీతంగా ఓటు వేసిన ప్రతి ఒక్కరూ నిలదీయాలన్నారు. ఓ సమస్య మీద పోరాడేటపుడు మనవాడు తనవాడు అన్న భావన లేకుండా పాలకులపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. వారాహి విజయ యాత్రలో భాగంగా గురువారం మధ్యాహ్నం అమలాపురం నియోజకవర్గంలో ప్రముఖులు, మేధావులతో పవన్ సమావేశమయ్యారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలు, వాటి అమలు తీరుపై వారితో చర్చించారు. పవన్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రైస్ బౌల్‌గా పేరున్న ఉభయ గోదావరి జిల్లాల్లో క్రాప్ హాలిడే ప్రకటిస్తే ఒక్క అధికారి కూడా పరిస్థితిపై లోతుగా అధ్యయనం చేసి రైతులతో మాట్లాడలేదన్నారు. . రైతు భరోసా కేంద్రాల పేరు చెప్పి రైతులను అడ్డంగా మోసం చేస్తున్నారని విమర్శించారు. సామాన్యులకి న్యాయం చేసే ప్రభుత్వ పథకాలు ఎన్నో ఉన్నాయి. వాటిని సరిగా అమలు చేస్తే రోజు వారీ వ్యాపారాలు చేసుకునే వారు వడ్డీ వ్యాపారుల బారిన పడాల్సిన అవసరం ఏముంది? ఇలాంటి అన్ని అంశాల మీద దీర్ఘకాలిక అధ్యయనం అవసరం. ప్రాంతీయ అవసరాలను బట్టి సబ్సిడీలు అమలు చేయాలని పవన్ సూచించారు. "రాష్ట్రంలో క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదు.. వర్షం కురిస్తే పడవలు తిరిగే రహదారులు రాష్ట్రం మొత్తం గంజాయి హబ్‌గా మార్చేశారు. యువతను నిర్వీర్యం చేసేశారు. ఇన్ని సమస్యల మధ్య ప్రజలు మార్పును కోరుకుంటున్నారు. మార్పు అనేది ఆరంభంలో ఎవరికీ కనబడదు. అది ఒక స్థాయికి వచ్చే సమయానికి అంతా తలో చేయి వేస్తారు. పదేళ్లుగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పార్టీని ముందుకు తీసుకువెళ్తున్నాం. పార్టీ నిర్మాణం ఒక్క రోజులో జరిగిపోదు. సమాజం పట్ల బాధ్యత ఉన్న వారి కోసం, నిలబడే వారి కోసం జనసేన పార్టీ అన్వేషిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల మధ్య ముందుకు రావడానికి చాలా మందికి రకరకాల భయాలు ఉంటాయి. జనసేన పార్టీని, సిద్ధాంతాలను ప్రజాక్షేత్రంలోకి తీసుకువెళున్నాం. క్షేత్ర స్థాయిలో పార్టీకి బలం ఉండబట్టే ఇంత దూరం ప్రయాణించగలిగాం. వచ్చే ఎన్నికల సమయానికి కచ్చితంగా జనసేన పార్టీ అధికారం చేపట్టే స్థాయికి బలపడుతుందన్న నమ్మకం నాకుంది" అని అన్నారు. అడ్వకేట్, దళిత బహుజన మహిళాశక్తి సంస్థ సభ్యురాలు కొంకి రాజామణి మాట్లాడుతూ... మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, వాటిపై పోరాడుతున్న సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ని ప్రభుత్వం ఏ విధంగా నిర్వీర్యం చేసింది అనే అంశాలను ప్రస్తావించారు. కోనసీమ ప్రాంతానికి చెందిన మహిళలు... కొబ్బరి పీచుతో తయారు చేసిన అందమైన బొమ్మలను పవన్ కళ్యాణ్‌కి బహుమానంగా పంపారు. కొబ్బరి పీచుతో అందంగా తీర్చిదిద్దిన కలశం, వినాయ కుడు, గుర్రం, ఏనుగు, పిచ్చుకగూడు లాంటి బొమ్మలు పవన్ కళ్యాణ్‌ని ఆకట్టుకున్నాయి. తనకోసం కళాకృతులు పంపిన ఆడపచులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ ఈఏపీసెట్ అర్హతా మార్కుల సమర్పణకు గడువు కొనసాగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్-అగ్రికల్చర్-ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్) 2023లో అభ్యర్థుల అర్హతా మార్కుల సమర్పణకు ఇంకా ప్రభుత్వం అవకాశమిచ్చింది. ఏపీ ఈఏపీసెట్ 2023 వెబ్‌సైట్‌లో సంబంధిత డిక్లరేషన్ విభాగం ఆప్షన్‌ను ఇంకా అందుబాటులో ఉంచారు. దీని గడువు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలతో ముగిసింది. అయినా కొంత మంది అభ్యర్థులు ఇంటర్, తత్సమాన మార్కులను అప్‌లోడ్ చేయలేదు. ఇటీవల ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. వారిలో కొందరు అర్హత మార్కులను డిక్లరేషన్ ఫార్మ్‌లో ఆన్ లైన్ ద్వారా పొందుపరచలేదు. తెలంగాణ విద్యార్థులు కూడా అందరూ తమ మార్కులను అప్‌లోడ్ చేయలేదు. దీంతో అలాంటి వారి కోసం ఏపీ ఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో ఆప్షన్‌ను ఓపెన్‌గానే ఉంచారు. అర్హతా పరీక్షలో ఉత్తీర్ణులై, ఇంకా సమర్పించిన వారంతా నేరుగా వెబ్‌సైట్‌లోకి వెళ్లి, ఈఏపీసెట్ రిజిస్ట్రేషన్ నంబరు, హాల్ టికెట్, సెల్ ఫోన్ నంబర్లను పొందుపరచాలి. ఈ సాంకేతిక అంశాలతో ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ మరింత జాప్యమే పరిస్థితులున్నాయి. తొలుత ఫలితాల సమయంలో జులై 15 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించేందుకు సిద్ధమవ్వాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులకు సూచించినప్పటికీ, ఆ దిశగా అడుగులు ముందుకు పడలేదు. ఇంకా కౌన్సెలింగ్‌కు సంబంధించిన ప్రాథమిక ప్రక్రియే పూర్తి కాలేదు. అటు ఏఐసీటీఈ నుంచి ఏపీలోని ఇంజినీరింగ్ కళాశాలలకు అనుమతులు రావాల్సి ఉంది. ఇవన్నీ ముగిసే సరికి కౌన్సెలింగ్ జాప్యమయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలి

పరుచూరి రాజేంద్ర బాబు

విశాలాంధ్ర - బాపట్ల: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల తక్షణమే భర్తీ చేసేలా నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. రాజేంద్ర బాబు మాట్లాడుతూ, ఈ నెల 27 నుంచి 30 వరకు గుంటూరులో రాష్ట్ర స్థాయి యువజన విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతను జగన్ నమ్మించి మోసం చేశారని అన్నారు. ఎన్నికల సమయంలో పాదయాత్రలు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇసామని చెప్పి నాలుగు సంవత్సరాలు

గడుస్తున్నా నేటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, జాబ్ క్యాలెండర్ ప్రకటనలకే పరిమితం చేశారన్నారు. రాష్ట్రంలో 55 వేల ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా రాష్ట్రంలో 700 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని ప్రకటించడం సరికాదన్నారు. రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులకు ఏఐవైఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి , రాజ్యసభ సభ్యులు పి. సంతోశ్ కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, ఏ ఐ వై ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ తిరుమలై, అధ్యక్షులు సుఖేందర్ మహేశ్వరి, రాష్ట్ర మాజీ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, గుజ్జుల ఈశ్వరయ్య, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, వందేమాతరం శ్రీనివాస్, జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు బ్రహ్మారెడ్డి, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం, మిమిక్రీ రమేష్ పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల యువజన వ్యతిరేక విధానాల పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగర కొండ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభానీ, మామిడి బత్తుల గణేష్, జిలానీ, దుర్గా ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అమెరికాలో గూడుకట్టుకున్న మోదీ వ్యతిరేకత

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా వెళ్లడం గత తొమ్మిదేళ్ల కాలంలో ఇది అయిదోసారి. అయితే భారత ప్రధాన మంత్రిగా పూర్తి అధికార లాంఛనాలతో జరిగిన పర్యటన మాత్రం ఇదే. అమెరికా కాంగ్రెస్(పార్లమెంట్) లో రెండోసారి ప్రసంగించిన ఘనత భారత ప్రధానమంత్రులలో మోదీ ఒక్కరికే దక్కింది అన్న ప్రచారం కూడా జోరుగానే సాగింది. ఇలాంటి అనుకూల ఆవరణ ఏర్పాటు చేసుకోవడంలో మోదీ దిట్ట. "అమెరికా పార్లమెంటు సభ్యులు, మేధావులు, ఇతరులు కూడా తన అమెరికా పర్యటన గురించి చాలా ఉత్సాహంగా ఉన్నారు" అని అమెరికా బయల్దేరే ముందు మోదీ ట్విట్టర్‌లో చెప్పుకున్నారు. మోదీ ఏం చెప్పుకున్నా, ఎంత ప్రచారం చేసుకున్నా ఆయన పర్యటనలో లాంఛనాలు ఎంత ఘనంగా ఉన్నప్పటికీ వ్యతిరేకత కూడా అంతే ఉంది. మోదీని వ్యతిరేకిస్తూ పత్రికలు పూర్తి పేజీ ప్రకటనలు చేశాయి. ఆయన పార్లమెంటు ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు కనీసం ఇద్దరు సభ్యులు - డెమొక్రాటిక్ పార్టీకి చెందిన సభ్యురాలు రషీదా తాలిబ్, మరో సభ్యురాలు ఇలాన్ ఒమర్ ఆయన ప్రసంగాన్ని బహిష్కరించారు. వీరు మోదీ ప్రసంగాన్ని ఎందుకు బహిష్కరిస్తున్నారో దాపరికం లేకుండానే చెప్పారు. మోదీ ప్రభుత్వం మత పరమైన మైనారిటీలను అణచి వేస్తోందని, ఆయన పాలనా విధానంవల్ల హిందూ జాతీయవాదులు పంజా విసురుతున్నారని వారు అన్నారు. మోదీకి మద్దతు ఇచ్చేవారు స్వాగత సన్నాహాలు చేసినప్పటికీ అనేక మానవ హక్కుల సంఘాల వారు నిరసన ప్రదర్శనలు చేశారు. మోదీ పర్యటనను నిరసిస్తున్న వారిలో డెమొక్రాటిక్ పార్టీకి చెందిన 75 మంది పార్లమెంటు సభ్యులు భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు, మైనారిటీల అణచివేత, గిట్టని మీడియా సంస్థల వారిమీద కొనసాగుతున్న దాడుల గురించి అధ్యక్షుడు బైడెన్ భారత ప్రధానమంత్రిని నిలదీయాలని ఒక లేఖ రాశారు. "మిత్రులు అనుకునే వారు తమ విభేదాలను కూడా నిర్మొహమాటంగా చర్చించు కోవాలి. రెండు దేశాలమధ్య అనేక ఉమ్మడి ప్రయోజనాలు ఉండొచ్చు. కానీ మోదీ హయాంలోని భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని కుళ్లబొడవడం, పత్రికా రచయితల మీద కఠినమైన చట్టాలు అమలుచేసి నానా యాతన పెట్టడం, మైనారిటీల మీద ద్వేషం పెంచడం గురించి బైడెన్ ఈ విషయాలు ప్రస్తావించి తీరాలి" అని అమెరికా పార్లమెంటు సభ్యులు బైడెన్ కు రాసిన లేఖలో డిమాండు చేశారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ మానవ హక్కులను, పత్రికా స్వేచ్ఛను, మతపరమైన స్వేచ్ఛను, బహుళత్వాన్ని గౌరవిస్తారు కనక, ఈ అంశాలే అమెరికా విదేశాంగ నీతికి మూల కందం కనక, శత్రు దేశాల విషయంలోనూ, మిత్ర దేశాల విషయంలోనూ ఇదే సూత్రాన్ని వర్తింప చేయాలి కనక మోదీని వీటి గురించి బైడెన్ నిలదీయాల్సిందేనని వీరు గట్టిగా కోరారు.

మరో వేపు న్యూయార్క్ నగర చట్టసభ సభ్యులు జొహ్రాన్ మందానీ, షహానా హనీఫ్, శేఖర్‌కృష్ణన్ మోదీ పర్యటన చూస్తే దిగులుగా ఉందన్నారు. ఈ ముగ్గురూ న్యూయార్క్ నగర చట్టసభకు మొట్టమొదటిసారి ఎన్నికైన దక్షిణాసియా దేశాల వారు. "గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మోదీ ముస్లింలకు వ్యతిరేకంగా హింసాకాండ రెచ్చగొట్టారు. అనేక మంది నిరసన కారులను జైళ్లలో తోశారు. పత్రికల మీద ఆంక్షలు విధిస్తున్నారు, జైళ్లల్లో పెడుతున్నారు. మైనారిటీలను అంతమొందించాలని చూస్తున్నారు. సెక్యులర్ ప్రజాస్వామ్యదేశమైన భారత్‌ను హిందూమతతత్వరాజ్యంగా మార్చేస్తున్నారు" అని వీరు దుయ్యబట్టారు. ఈ అంశాల గురించి బైడెన్ భారత ప్రధాన మంత్రిని నిలదీయాలని అమెరికాలోని అనేక హక్కుల సంఘాలూ కోరాయి. భారత్‌లో స్వేచ్ఛా రాహిత్యం గురించి మోదీని ప్రశ్నించాలని అంతర్జాతీయ పత్రికా సంస్థ (ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్-ఐ.పి.ఐ.) కోరింది. ప్రభుత్వాన్ని విమర్శించే పత్రికా రచయితలను మోదీ ప్రభుత్వం ఆరడి పెడ్తోందని ఈ సంస్థ దుమ్మెత్తి పోసింది. కర్కశ చట్టాలను మీడియా వారి మీద పదునైన ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేసింది. భారత్‌లో పత్రికా స్వేచ్ఛ హరించుకు పోవడాన్ని తక్షణం నిలిపి వేయాలని ఈ సంస్థ కోరింది. ప్రస్తుతం మోదీని విమర్శించిన ఆరుగురు ప్రసిద్ధ పత్రికా రచయితలు జైళ్లలో మగ్గుతున్నారని గుర్తు చేసింది. ఇలాంటి దురాగతాలను వెంటనే ఆపేయాలని ఐ.పి.ఐ. సంస్థ గత నెలలో మోదీకి బహిరంగ లేఖ కూడా రాసింది. మోదీ హయాంలో పత్రికా స్వేచ్ఛ కనుమరుగై పోవడాన్ని ఇతర ఏడు అంతర్జాతీయ సంస్థలు కూడా ఎత్తి చూపాయి. భద్రతా చట్టాలను పత్రికా రచయితల మీద ప్రయోగించడం దారుణమని ఎలుగెత్తి చాటాయి. పత్రికా రచయితల మీద చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యు.ఎ.పి.ఎ.), ప్రజా భద్రతా చట్టం, దేశద్రోహ చట్టం లాంటివి మోపడం మామూలై పోయింది. గత ఒక్క సంవత్సరమే పత్రికా రచయితలను వేధించిన సందర్భాలు 200 పై చిలుకు మాటేనని ఐ.పి.ఐ. తెలియజేసింది. మానవహక్కులు, ప్రజాస్వామ్యం కోసం పోరాడే వారి మీద కత్తిగట్టినట్టు ప్రవర్తించడం మోదీ ప్రభుత్వ ప్రత్యేకత. ఇలాంటి సమయంలో ప్రజాస్వామ్యానికి కాపలాదారుల్లా వ్యవహరించవలసిన మీడియా రంగం మీద మోదీ కనికరం చూపిస్తుందనుకోవడం దుర్లభం.

మీడియా మీద, ప్రభుత్వ దుశ్చర్యలను ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులమీద మోదీ ప్రభుత్వం విరుచుకు పోవడంలో కూడా ఓ విశిష్టత ఉంది. ప్రత్యేకించి ముస్లింలను ద్వేషించడం మోదీ పాలనతోనే మొదలైంది. కశ్మీర్‌కు ఉన్న రాష్ట్ర ప్రతిపత్తిని తొలగించి ఆ ప్రాంతాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడదీయడంలో కూడా ప్రధానంగా కనిపించేది ముస్లింల మీద ద్వేషమే. అక్కడ ప్రజాస్వామ్య పరిపాలన అంతమై అయిదేళ్లు గడిచినా ఇప్పటికీ ప్రజలు స్వేచ్ఛగా తిరుగాడే పరిస్థితి లేదు. చీటికి మాటికి అంతర్జాలంపై నిషేధం విధిస్తూనే ఉన్నారు. అంటే నేరుగా భావ ప్రకటనా స్వేచ్ఛను కాల రాస్తున్నారు. ఇవన్నీ అంతర్జాతీయ సమాజం గమనిస్తూనే ఉందనడానికి తాజా నిదర్శనమే అమెరికా పర్యటనలో మోదీ వ్యతిరేకత పెచ్చరిల్లడానికి కారణం. అమెరికా పార్లమెంటు సభ్యులు, మీడియా సంస్థలు మోదీని నిలదీయాలని కోరుతున్నా అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆ పని చేయరు. ఈ మాట వైట్‌హౌస్ జాతీయ సలహాదారు జేక్ సల్లివాన్ బుధవారమే తేల్చేశారు. భారత్‌లో ఎలాంటి ప్రజాస్వామ్యం ఏమేరకు ఉండాలో నిర్ణయించుకోవలసింది భారతీయులేనని సల్లివాన్ స్పష్టంగానే చెప్పారు. బైడెన్ ఈ అంశాలను మోదీతో ప్రస్తావించక పోవడానికి అధికార పర్యటనల సమయంలో పాటించవలసిన మర్యాదలు కారణం కావచ్చు. అందుకే ఈ అంశం తాము నిర్ణయించేది కాదని సల్లివాన్ అంటున్నారు. ఆ మాట ఎంత నిజమైనా అమెరికాలో అందరూ మోదీకి హారతులు పట్టడం లేదని మాత్రం కచ్చితంగా రుజువైంది.

ఇప్పుడేం చేయాలి

ఇప్పుడేం చెయ్యాలి. నేనిప్పుడేం చెయ్యాలి. రా బావ ఏంటి ఏం చెయ్యాలని పాడుకుంటూ వస్తున్నావు. పార్వతి ఈరోజు మళ్లీ ఏవో పాటులు పాడుతున్నాడు. కాఫీ యిచ్చి మరల పాడించుకుందాం. నువు కూడా రా. అవును మా చెల్లి కూడ రావాలి. ఆమే కాదు మన దేశంలో ఓటున్న ప్రతివాడు వినాలి. విని నన్ను ఈ బాధ నుండి విముక్తి చేయాలి. అదిసరె యిప్పుడు నీకున్న బాధేంటి. నాకంటావేమిటి నీకు లేదా బాధ. నాకేం లేదుగాని నీ బాధేంటో చెప్పు. భలేవాడివయ్యా ప్రపంచ ప్రజలందరి బాధే నా బాధ అన్నాడు మహాకవి శ్రీశ్రీ. అలాగె ఓటున్న ప్రతి వ్యక్తి బాధె నా బాధ. నీవంటున్నావుగాని నాకేం బాధ లేదు. ఏంటి బాధ లేదా అయితే నువ్వు ఆలోచించడం మానేశావన్న మాట. అసలు ఈ ప్రపంచంలో బాధలేని మనిషిని ఒక్కడిని చూపించు. రోజువారి కూలి దగ్గర నుండి ప్రపంచ అగ్రనేత వరకు బాధలేని మనిషిని ఒక్కడిని చూపించు. జంతువులకు ఆలోచనా శక్తి లేదు.

ఒకదాని వెంట మరొకటి నడిచిపోతూ ఉంటాయి. కాని



మనిషికి మెదడుంది. అతి ఆలోచిస్తూనే ఉంటుంది. కొంచెం విశ్రాంతి దొరికినప్పుడల్లా ఆలోచనలు మొదలవుతాయి. ఫలితంగా కొన్ని భావాలు, వాటి నుండి కోర్కెలు అవి తీర్చుకోవడానికి మనిషి ఉద్యమిస్తాడు. ఆ ఉద్యమానికి స్నేహ హస్తం కోసం ఎదురు చూస్తాడు. అది సరె యిదంతా ఎందుకు చెబుతున్నావు. అబ్బ ఏమి తెలియనట్లు నంగనాచి తుంగబుర్ర అన్నట్లు మాట్లాడతావు. నీకు ఓటుంది కదా. కొద్ది నెలల్లో ఎన్నికలు కదా ఎవరికేస్తావో చెప్పు. నేను ఆలోచించలేను. నువు మేధావి కదా మంచి రాజకీయ విశ్లేషకుడివి కదా చెప్పు. నీ నిర్ణయం నేను ఫాలో అవుతాను. నిజమె కాని ప్రస్తుతం కులమత వర్గాలతో కూడిన సమాజం. అందుకె ఏమీ ఆలోచించకుండా వారి నాయకులు చెప్పినట్లు ఓట్లు వేస్తున్నారు. కాని అది తప్పు.

ప్రతి వాడికి మెదడుంది. ప్రతి ఓటరు ఆలోచించి ఓటు వేయాలి. గత ప్రభుత్వం ఏమి చేసింది. సమాజంలో ఏ వర్గానికి ఉపయోగపడింది. ఇప్పుడున్న ప్రభుత్వం ఏ వర్గాలకు ఉపయోగపడుతోందని ఆలోచించాలి. ప్రస్తుతం అన్ని వర్గాల కు ఉపయోగపడాలంటె యిప్పుడున్న బడ్జెట్ చాలదు. ప్రస్తుతమున్న ఆర్థిక పరిస్థితిలో ముందెవరికి ఉపయోగపడాలని నాయకులు ఆలోచించాలి. అబ్బ దానికి పెద్దగా ఆలోచించేదేముంది. జీవనం జరగని వాడిని బతికించాలి.

ఆ తరువాత వాడి వృత్తిని కొనసాగించడానికి ప్రభుత్వం సాయం చేయాలి? నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి. ముఖ్యంగా అందరికి అన్నం పెట్టె అన్నదాత రైతు సమస్య పరిష్కరించాలి. తరువాత ఊపిరి పీల్చుకున్నాక అభివృద్ధి వైపు అడుగిడాలి. నిజమె సంక్షేమ కార్యక్రమాల ద్వారా మనిషిని బతికించుకుని ఆ తరువాత అభివృద్ధి వైపు దృష్టి సారించాలి. ఈ రెండు సమాజాభివృద్ధికి రెండు కళ్లలాంటివి. ఇక ఆపు బావ. నీవు చెప్పిన ప్రకారం యిపుడెవరికి ఓటెయ్యాలి. ఓటు విషయానికొస్తే నేతల ఆలోచన ప్రవర్తన కూడ పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతి ప్రభుత్వంలో మంచి చెడులు ఉంటాయి. అసలు చేసిన వాగ్దానాలు అమలు చేసే వారెవరనేది ముఖ్యం. ప్రతిపక్ష ప్రభుత్వం చేసే తప్పులు ఎత్తిచూపి ఏం వేయాలో వివరించి ప్రజల ముందు పెట్టాలి. అలాకాక ఏమీ చెప్పకుండ ఉన్న ప్రభుత్వాన్ని దిగిపొమ్మంటే ప్రజలు నమ్మరు. పోని వారు గద్దె ఎక్కితే ఇంతకంటె మంచి ఏం చేస్తారో చెప్పాలి. అదేదో సినిమాలో హైద్రాబాదుకు సముద్రాన్ని తెస్తా అన్నట్లు కాకుండ ఉన్న బడ్జెటు పరిధిలో ఇస్తున్న, చేస్తున్న వాటిని మించి ఏం చేయగలరో చెప్పాలి. అన్నింటికంటె నాయకుని వ్యక్తిత్వంపై ప్రజలకు నమ్మకం కలగాలి. అయితె ఇప్పుడేం చెయ్యాలి. నీ బుర్ర నాకు తాకట్టు పెట్టవద్దు. ఆలోచించి నిర్ణయం తీసుకో.

సెల్: 9885569394

హర్యానలోనూ బీజేపీకి తీవ్ర కష్టాలు

డా॥ జ్ఞాన్ పాఠక్

హర్యాన అసెంబ్లీకి మరో పదినెలలకు ఎన్నికలు జరగవలసి ఉంది. 2024లో లోక్‌సభ ఎన్నికల తర్వాతే అసెంబ్లీ ఎన్నికలు జరగాలి. ఈలోపు హర్యానలో బీజేపీ తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నది. ఇక్కడ బీజేపీ-జెజెపీ సంకర్ణ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ రెండు పార్టీల మధ్య పొసగడం లేదు. జెజెపీ తనదారి తాను చూసుకుంటానని కూడా హెచ్చరించింది. ముఖ్యమంత్రిగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ మనోహర్‌లాల్ ఖట్టర్ పని చేస్తున్నారు. 2019లో అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడిన అనంతరం బీజేపీ జేజెపీతో పొత్తు కుదర్చుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జగన్నాయక్ జనతా పార్టీ(జెజెపీ) గాకుండా మరో ఏడుగురు ఇండిపెండెంట్లు సంకీర్ణ ప్రభుత్వంలో ఉంటున్నారు. అసెంబ్లీలో మొత్తం 90 స్థానాలుండగా బీజేపీ 40సీట్లలో గెలిచి అతిపెద్దపార్టీగా అవతరించింది. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని పది ఎంపీ సీట్లు గెలిచిన బీజేపీ 40అసెంబ్లీ సీట్లు మాత్రమే దక్కడంతో తీవ్ర షాక్ తిన్నది. ఈ రెండు ఎన్నికలకు కేవలం 5 నెలలు మాత్రమే తేడా అయినా అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ సీట్లు గెలుచుకున్నది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 58.21 శాతం ఓట్లు రాగా అసెంబ్లీ ఎన్నికలకు 36.49 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే బీజేపీకి ఓటు శాతం తీవ్రంగా పడిపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొంది మూడోసారి ప్రధానిగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆశిస్తున్న మోదీకి తాజా పరిణామం తీవ్రంగా కలవరపెడుతోంది. ఒక్క లోక్‌సభ సీటు తక్కువైనా ఆందోళన కల్గిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లోనూ తప్పని సరిగా గెలవాలన్నది బీజేపీ ఆలోచన. అయితే తాజా పరిణామాలు ఆపార్టీకి ఆందోళన కలిగిస్తోంది. పొత్తు కుదిరి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుండి ఘర్షణ మొదలైంది. తాజాగా ఇది బహిరంగమైంది. వారంక్రితం జెజెపీ ఎమ్మెల్యే (షహబాద్) రామ్‌కరణ్ కళ 'షుగర్ ఫెడ్‌కు' (హర్యాన చక్కెర మిల్లుల సహకార సమాఖ్యసంస్థకు రాజీనామా చేశారు. పొద్దు తిరుగుడు పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ నిరసన తెలిపిన రైతుల పై లాఠీ చేర్చి చేసి గాయపరిచినందుకు గాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఆ తర్వాత బీజేపీ జెజెపి



మధ్య ఒప్పందం కుదిరిందని ఎమ్మెల్యే రాజీనామా వెనక్కు తీసుకుంటారని రెండుపార్టీల నాయకులు ప్రకటించారు. అయితే రైతులు ఈసారి ఎన్నికల్లో పాలకులు తగిన గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. దీంతో రెండు పార్టీల మధ్య ఘర్షణ సమసిపోయే అవకాశం తక్కువే. క్షేత్రస్థాయిలో రెండు పార్టీలో మధ్య సంబంధాలు సక్రమంగా లేవు. రాజకీయంగా తాము దెబ్బతినడానికి సిద్ధంగాలేమని జెజెపీ వర్గాలు చెప్తున్నాయి.

కాంగ్రెస్‌ను అధికారానికి దూరంగా ఉంచాలనుకుంటే బీజేపీ-జెజెపి మధ్య పొత్తు తప్పదని జెజెపీ నాయకుడు అజయ్ చౌతాలా అంటున్నారు. ఒప్పందం కుదరినట్లు ప్రకటించాక రెండు పార్టీల నాయకులు చేస్తున్న ప్రకటనలు కుదిరిన ఒప్పందం పనిచేయడం లేదని తెలియజేస్తున్నాయి. రాష్ట్ర బీజేపీ ఇన్‌ఛార్జీ విప్లవ కుమార్ దేవ్‌చర్యలు, ప్రకటనలు రెండు పార్టీలు మధ్య దూరాన్ని పెంచుతున్నాయని స్పష్టమవుతోంది. జెజెపి నాయకులకు వ్యతిరేకంగా ఆయన మాట్లాడుతున్నారు. నిరాశకు లోనవుతున్న బీజేపీ నాయకులు జెజెపీ నాయకత్వానికి, వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఈ అంశాన్ని అజయ్ చౌతాల నిజమేనని అంటూ బీజేపీ తమకు సహజమిత్రపార్టీ ఏమీ కాదని అన్నారు. ఈ పరిణామాలు కాంగ్రెస్‌కు సానుకూల వాతావరణం కల్పిస్తున్నదని సూచనలు అందజేస్తున్నాయి. ఐఎన్ఎల్‌డిలో విభజన జరిగి జెజెపి పార్టీ ఏర్పడింది. ఈ పార్టీ ఒక్క సీటులో మాత్రమే గెలిచింది. కాంగ్రెస్ 31 సీట్లలో గెలుపొందింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 47 ఐఎన్ఎల్‌డి 19, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకున్నాయి. 2014, 2019లలో జరిగిన ఎన్నికల మధ్యకాలంలో కాంగ్రెస్ బలం పెరిగింది. రానున్న ఎన్నికల్లో బీజేపీ, జెజెపీల, రాజకీయ క్షేత్రస్థాయి మద్దతు మరింత పడిపోతుందని అంచనా. రాష్ట్రంలో రైతులు బీజేపీపై మండిపడుతున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జెజెపీకి 14.84 శాతం ఓట్లు రాగా ఐఎన్ఎల్‌డికి 2.44 శాతం ఓట్లు వచ్చాయి. ఈ రెండు పార్టీలు విడిపోక ముందు ఐఎన్ఎల్‌డికి 24.11 శాతం ఓట్లున్నాయి. జెజెపీ మద్దతు తమకేమీ అవసరం లేదనీ కొందరు బీజేపీ నాయకులు ప్రకటిస్తున్నారు. జెజెపీకి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కసీటైనా కేటాయించే అవకాశం లేదని చెప్తున్నారు. కొన్ని సీట్లలో పోటీ చేయాలని జెజెపి తలపెట్టింది. అందువల్ల రెండు పార్టీల మధ్య వచ్చే ఎన్నికల్లో పొత్తు ఉండటంకష్టమే. ఈ నేపథ్యంలో జెజెపి, ఐఎన్ఎల్‌డిలు త్వరలో విలీనమవుతాయని ఈ దిశలో చర్చలు జరుగుతున్నాయని జెజెపి నాయకుడు అజయ్‌చౌతాలా, ఐఎన్ఎల్‌డి నాయకుడు ఓంప్రకాష్‌చౌతాలా తెలియజేశారు. 2018 తర్వాత ఉపప్రధానిగా పనిచేసిన దేవీలాల్ మనవళ్లు అభయ్ చౌతాల, అజయ్ చౌతాల మధ్య అధికార పోరాటం జరిగి పార్టీ విడిపోయింది. వీరిరువురు పార్టీ అధ్యక్షుడు ఓంప్రకాష్ కుమారులు అభయ్ చౌతాలకే తండ్రి ఓం ప్రకాష్ మద్దతు పలికారు. అప్పుడు జెజెపి పార్టీ ఏర్పడింది. జైలు నుండి విడుదలైన ఓంప్రకాష్ చౌతాలా రెండు పార్టీల విలీనానికి కృషి చేస్తున్నారు. రకరకాల కారణాలతో రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి అస్పష్టంగా, అనిశ్చయంగా ఉంది. బీజేపీకి జాతీయ స్థానిక ప్రయోజనాలున్నాయి. అయితే ప్రాంతీయ పార్టీల ఆకాంక్షలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. ఇప్పుడు బీజేపీకి రాష్ట్రంలో రెట్టింపు వ్యతిరేకత నెలకొని ఉంది. భూపేందర్ సింగ్ హుడా నాయకత్వంలో కాంగ్రెస్ సమీపంలోని హిమాచల్‌ప్రదేశ్ విజయం పొందిన తర్వాత నూతన ఉత్తేజాన్ని పొందింది. లోక్‌సభ ఎన్నికల్లో గరిష్ఠ సంఖ్యలో సీట్లు గెలవాలని కాంగ్రెస్ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీకి అవకాశాలు దిగజారుతున్నాయి.

ఇ-మెయిల్

భయపెడుతున్న వ్యాధులు

తాజాగా భారత వైద్య పరిశోధనా మండలి ఆధ్వర్యంలో జరిగిన ఒక పరిశోధనా పత్రం ప్రముఖ అంతర్జాతీయ పత్రిక లాన్ సెట్‌లో ప్రచురితమైంది. దాని ప్రకారం భారత్‌లో ఇప్పుడున్న మధుమేహ వ్యాధిగ్రస్తులు 10 కోట్ల మంది. మరికొద్ది కాలంలో ఆ వ్యాధి బారిన పడబోయే రిస్క్ ఉన్న వారు (సాధారణం కన్నా ఎక్కువ బ్లడ్ షుగర్ కలిగి ఉన్నవారు- ప్రీ డయాబెటిక్స్)13 కోట్లమంది. ఈ వ్యాధి మాత్రమే కాకుండా స్థూలకాయం, అధిక రక్తపోటు, రక్తంలో ఎక్కువ కొలెస్ట్రాల్ ఉన్నవారు ఈ దశాబ్దంలో ఎక్కువ సంఖ్యలో నమోదయ్యారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం రానున్న ఏడేళ్లలో భారత్ అదనంగా 6 లక్షల కోట్ల రూపాయల్ని ఈ వ్యాధుల వల్ల నష్టపోతుంది. ఈ నివేదికల్లో అంకెలపై భేదాభిప్రాయాలు ఎవరికైనా ఉండొచ్చు కానీ అందరూ అంగీకరించేది ఒకటే : అదేమిటంటే భారత్ ప్రపంచ మధుమేహ కేంద్రంగా మారిందని. జీవన శైలి వ్యాధులు అంటురోగాల కన్నా ఎక్కువగా విజృంభిస్తున్నాయని. ఇది భయపడాల్సిన విషయం. ఇక ధైర్యం పొందాల్సిన విషయం ఏమిటంటే సరైన ప్రణాళికతో ఈ స్థితి నుండి బయటపడొచ్చు. ఆరోగ్య సమాజాన్ని సాధించొచ్చు. వ్యక్తి నుండి వ్యవస్థ దాకా మేల్కొంటే చాలు.

జీవన శైలి వ్యాధులకు మూలకారణం దాని పేరులోనే ఉన్నట్లు తప్పుడు జీవన శైలి. ఆహారంలో, రోజువారీ శారీరక కదలికల్లో, మానసిక అంశాల్లో సరిగ్గా లేకపోవడం.అసహజ ధోరణులు అలవర్చుకోవడం. వాటిని కొనసాగించడం.వాటివల్లనే అధిక బరువు,శరీరంలో కొవ్వు పేరుకుపోవడం. వివిధ రకాల వ్యాధులు చుట్టుముట్టడం. సహజంగా నియంత్రించుకోదగ్గ ఈ వ్యాధుల వల్ల ఆయా వ్యక్తులు శారీరకంగా, ఆయా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. సమాజంపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఈ స్థితి నుండి బయటపడడానికి అందరూ నడుం కట్టాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పౌరసమాజం పూనుకొంటే ఈ వ్యాధులు అదుపులో ఉండడమే కాకుండా, ఇప్పుడు అనుకొంటున్న ఆ 13 కోట్ల మంది చక్కెర వ్యాధి రాగల అవకాశం ఉన్నవారిలో సగం మంది అయినా హాయిగా బయటపడిపోతారు. మరికొంతమంది చేరికలు తగ్గుతాయి.

వ్యక్తిగత స్థాయిలో జంక్ ఫుడ్‌కి దూరంగా ఉండాలి. ఫాస్ట్ ఫుడ్, అధిక మోతాదులో కొవ్వు, ఉప్పు, నూనె ఉన్న పదార్థాలు తినడం మానెయ్యాలి. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలి. ప్రతీ రోజూ కనీసం అరగంట వ్యాయామం లేదా నడక చెయ్యాలి. ఒక నివేదిక ప్రకారం ప్రతీ రోజూ గంట నడిచే వాళ్లలో, ఎలాంటి వ్యాయామం చెయ్యని వారికన్నా గుండెపోట్లు 67శాతం తక్కువ.ఇలా ప్రత్యక్షంగా ప్రభావం కనబడుతున్న మంచి జీవన శైలి అలవర్చుకోవాలి. ఇది ఖర్చులేని పని కూడా. అలాగే మానసిక వత్తిడికి, పొగాకు, మద్యపానం వ్యసనాలకు దూరంగా ఉండాలి.

డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, 9440836931

హిమంతకు టెర్రరిస్టులతో సంబంధాలు

ఆశిస్ బిస్వాస్

ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీకి అత్యంత కీలకమైన నేతగా అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మకు గతంలో తీవ్రవాదులతో, టెర్రరిస్టులు, చొరబాటు దారులతో సంబంధాలున్నాయన్న వార్తలు వెలువడి సంచలనం కలిగించాయి. అనంతరం ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. మణిపూర్‌లో రెండు గిరిజన తెగలు మెయితీలు, కుకీల మధ్య చెలరేగిన మంటలు ఆరలేదు. హిమంతకు మణిపూర్‌లో శాంతిభద్రతలు అప్పగించింది. గతంలో టెర్రరిస్టులతో సంబంధాలున్నందున మణిపూర్ బాధ్యతను అప్పగించి ఉండవచ్చునని కూడా భావిస్తున్నారు. మణిపూర్‌లో ఆరనిమంటల ప్రభావం అసోంపైన కూడా ఉంటుందని భావిస్తున్నారు. అనూహ్యంగా ఈశాన్య ప్రాంతంలో కొత్త విషయాలు వెలుగు చూడటంతో రాజకీయ పరిస్థితులు మరోమలుపు తిరిగాయి. మణిపూర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రెండు రోజులు పర్యటించి, శాంతి కమిటీని ఏర్పాటు చేసివచ్చిన తర్వాత కూడా రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు ఆగకపోగా హింస తీవ్రమైంది. చివరకి రాష్ట్ర హోం మంత్రి ఇంటిని సైతం దగ్ధం చేసేందుకు దుండగులు దాడిచేసి పాక్షికంగా ధ్వంసం చేశారు. అమిత్ షా పర్యటన విఫలం కావడంవల్లనే హిమంతకు అదనపు బాధ్యతను అప్పగించారని భావిస్తున్నారు. పొరుగున ఉన్న మైన్మార్ నుండి అక్రమ చొరబాటుదారులు వస్తున్నందున రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు, గృహదహనాలు, లూటీలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. రాష్ట్రంలో కల్లోల పరిస్థితులను చక్కదిద్దడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. దీనితో రాష్ట్రం అరాచక పరిస్థితిలోకి జారుకుంటోందని అంచనా. మాట మాట్లాడితే తమది డబుల్ ఇంజన్ సర్కార్ అని ప్రచారంచేసే ప్రధాని మణిపూర్ కల్లోలాన్ని గూర్చి అంతగా పట్టించుకున్న దాఖలాలులేవు. మెయితీలకు అనుకూలంగా బీజేపీ వ్యవహరించడమే ఈ అల్లర్లకు మూలమన్న విషయం అందరికీ అర్థమైంది.

ఇటీవల కంగ్‌పొక్పి జిల్లాలో దొంగచాటుగా కుకీ మిలిటెంట్లు 13మంది మెయితీలను కాల్చిచంపినట్లుగా వెలుగులోకి వచ్చింది. కొండప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు తమను మెయితీలు లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరుపుతున్నారని ఫిర్యాదు చేస్తున్నారు. ఇదిలాఉండగా, అసోం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తీవ్ర ఇబ్బందికరమైన అంశాలను వెలుగులోకి తెచ్చారు. అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మ గతంలో

టెర్రరిస్టులతో సంబంధాలు పెట్టుకున్నారన్న విషయం బైటపెట్టడంతో ఒక్కసారిగా సంచలనం సృష్టించింది. వివాదాస్పదమైన ఇలాంటి వ్యక్తులను పాలక బీజేపీ ఎందుకు ప్రోత్సహిస్తున్నారనేది ఆ పార్టీ ప్రతినిధులు చెప్పవలసి ఉంటుంది. పైగా కల్లోల ప్రాంతాల్లో వివాదాస్పదమైన వ్యక్తులకు బాధ్యతలు అప్పగించడం ఏమిటని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. అసోంకు చెందిన 12 రాజకీయ పార్టీల నాయకులు టెర్రరిస్టులతో సంబంధం కలిగిన శర్మను దేశభద్రతా చట్టంక్రింద తక్షణం అరెస్టు చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రకటన చేసిన పార్టీలలో కాంగ్రెస్, సీపీఎం, రైజర్‌డాల్, అసోం జాతీయ ప్రత్యర్థి, సీపీఐ, ఆర్‌జేడీ, జెడీ(యు), తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ(ఎంఎల్) సంతకాలు చేశాయి. రహస్యంగా పనిచేసే తీవ్రవాదులతోనూ, నిషేధిత కుకీ గిరిజన సంఘాలతోనూ శర్మకు సంబంధాలు ఉన్నాయని వెలుగులోకి వచ్చింది. తమ డిమాండ్‌పై కేంద్రనాయకత్వం స్పందన లేకపోతే తాము ఢిల్లీకి వెళ్లి విలేకరులతో మాట్లాడి అన్నివిషయాలు చెపుతామని అసోంకు చెందిన ఈ పార్టీల ప్రతినిధి వెల్లడించారు. రాజకీయ పరిస్థితిని గందరగోళం పరచడానికి ప్రస్తుతం వివిధ జాతులు, వివిధ మతాలకు చెందిన ప్రజల మధ్య సఖ్యతను శర్మ తన వివాదాస్పదమైన ఎత్తుగడలతో, ప్రతిపక్షాన్ని అణచివేసేందుకు ఆయనను అసోం ముఖ్యమంత్రిగా కొనసాగిస్తారని ప్రకటన చేసిన నాయకులు తెలియజేశారు. శర్మ చేసే పనుల్లో అత్యంత క్రూరంగా పోలీసుల ఎన్‌కౌంటర్‌లను ప్రోత్సహించడం, ప్రైవేటు ఆస్తులపై బుల్‌డోజర్‌లు నడపడం, అతి తక్కువ సమయంలో వారికి నోటీసులు ఇవ్వడం ప్రత్యర్థులైన రాజకీయ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి హింసించడం, బీజేపీకి ఓట్లు వేయని సామాజికంగా వెనుకబడినవారిని హింసించడంఉన్నాయి. ఈశాన్యప్రాంతంలో తీవ్రవాద గ్రూపులతో సంబంధాలను నెరపుతున్న శర్మలాంటి వారినుండి ఎటువంటి ప్రయోజనాలను ఆశించలేం. అంతేకాదు, వివిధ సామాజిక గ్రూపుల మధ్య భయాందోళనలను సృష్టించడం ఈ పరిస్థితి అసోంలేనే కాకుండా, ఎక్కడైనా కనిపిస్తోంది. ఇలాంటి చర్యలను జాతీయ,అంతర్జాతీయ మానవహక్కుల గ్రూపులు, కొన్నిసార్లు న్యాయాధికారులు ఖండిస్తూనే ఉన్నారు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే, బీజేపీ కేంద్ర నాయకత్వం క్రూరమైన చర్యలకు పాల్పడుతున్న శర్మపై ఏమాత్రం విమర్శించడంలేదు. ఈశాన్యప్రాంతంలో శర్మ సుప్రీం నాయకుడిగా చలామణి అవుతున్నారు. ఆయనను ఏమీ అనకపోగా, ఈప్రాంత వ్యవహారాలన్నీ ఆయనకే అప్పగించారు. ఆయనచేసే పనులకు సంబంధించి మోదీ-షా లకు మాత్రమే జవాబు చెప్పవలసి ఉంటుంది. వీరిద్దరూ శర్మ చేసే పనులను బహుశ మెచ్చుకుంటున్నారు. ఇటీవల శర్మ గౌహతిలో కుకీ సాయుధగ్రూపుల ప్రతినిధులతో రహస్యంగా కలుసుకుని మాట్లాడారు. ఆ తర్వాత ఆయన ఇంఫాల్‌కు చేరుకుని ఈ ప్రాంతంలో జరుగుతున్న హింసాకాండను నిలిపివేసేందుకు తిరిగినట్లుగా బీజేపీ వర్గాలు చెప్పాయి. ఆయన వివిధ గ్రూపుల ప్రతినిధులు, అధికారులతో మాట్లాడారు. ఢిల్లీ నుంచి ఆదేశాలు రావడం వల్లనే మణిపూర్ బీజేపీ మంత్రులతో సహా ఆయన మాట్లాడుతున్నారు. అయితే ఇందుకు సంబంధించిన విషయాలను అధికారికంగా వెల్లడించలేదు. అసోం కాంగ్రెస్ అధ్యక్షుడు భూపేన్ బొరాహ్ మాట్లాడుతూ కుకీ తీవ్రవాద నాయకుడు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)అధికారులకు అసలు విషయం తెలియజేశారు. తాము శర్మను కలుసుకున్నది నిజమేనని వారు వెల్లడించారు. మణిపూర్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగినప్పుడు బీజేపీని గెలిపించేందుకు తాము సహకరిస్తామని అయితే తమ కోర్కెలను అంగీకరించాలని శర్మ, రామ్ మాధవ్‌లతో చెప్పినట్లుగా కుకీ గిరిజన నాయకుడు తెలిపారు. టెర్రరిస్టులతో సంబంధంఉన్న నాయకుడికే ఈప్రాంతంలో శాంతిని నెలకొల్పే బాధ్యత అప్పగించడం అత్యంత తీవ్రమైన నేరమే అవుతుంది.

మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణ జరగాలి

కాంగ్రెస్ పార్టీ



న్యూఢిల్లీ : మణిపూర్ పరిస్థితిపై హోం మంత్రి అమిత్ షా ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం 'చాలా తక్కువ, చాలా ఆలస్యం' అని కాంగ్రెస్ గురువారం అభివర్ణించింది. పోరాడుతున్న వర్గాలను దిల్లీలో కూర్చోబెట్టి చర్చల వేదిక పైకి తీసుకువచ్చే ప్రయత్నాల్లో గంభీరత లోపిస్తుందని పేర్కొంది. ప్రధాని లేని సమయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నందున ఆయనకు అఖిలపక్ష సమావేశం ముఖ్యం కాదన్నది స్పష్టమవుతోందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. '50 రోజుల నుంచి మణిపూర్ మండుతున్నా ప్రధాని మౌనం వహించారు. ప్రధాని దేశంలో లేని సమయంలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ప్రధానమంత్రికి ముఖ్యమైనది కాదన్నది స్పష్టమైంది' అని గాంధీ హిందీలో ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ మాట్లాడుతూ దేశం మొత్తం కేంద్ర ప్రభుత్వం నుంచి తీవ్రమైన జోక్యాన్ని ఆశిస్తున్నదని, కనీసం మణిపూర్‌లోనే ప్రధాని స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి ఉండాల్సిందని అన్నారు. 'శాంతి కోసం ఏ ప్రయత్నమైనా మణిపూర్‌లో జరగాలి. అక్కడ పోరాడుతున్న వర్గాలను చర్చా వేదికపైకి తెచ్చి రాజకీయ పరిష్కారం సాధించాలి. ఈ ప్రయత్నాన్ని దిల్లీలో కూర్చుని చేస్తే గంభీరత లోపిస్తుంది' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మణిపూర్‌లో 50 రోజుల హింసాత్మక, విధ్వంసం తర్వాత, హోం మంత్రి అమిత్ షా అఖిలపక్ష సమావేశానికి పిలుపు ఇవ్వడం చాలా ఆలస్యం' అని ఆయన అన్నారు. గత 54 రోజులుగా మణిపూర్ మండిపోతోందని, ప్రజలు పరస్పరం పోరాడుతున్నారని వేణుగోపాల్ తెలిపారు. 'ప్రధాని ఇంకా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ప్రధాన మంత్రి మన స్వంత రాష్ట్రమైన మణిపూర్‌కు కూడా కొంత సమయం వెతకాలి' అని ఆయన అన్నారు. భారత ప్రధాని ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే కోరిందని వేణుగోపాల్ చెప్పారు. 'హోం మంత్రి ఇప్పటికే అక్కడకు వచ్చారు. అక్కడ కసరత్తు చేశారు. హోం మంత్రి మళ్లీ సమావేశం పెట్టడం ఏమిటి. కనీసం ప్రధాని స్థాయి సమావేశం అయినా మణిపూర్‌లో జరగాలి' అని ఆయన అన్నారు. మణిపూర్ ఇంకా మండుతూనే ఉందని, ప్రజలు ఒకరితో ఒకరు పోరాడుతున్నారని, చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, చాలా ఆస్తులు తగలబడిపోయాయని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'కానీ ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కనీసం, ప్రధాని నుంచి శాంతి పిలుపుని ఆశిస్తున్నారు. అది కూడా రాలేదు' అని తెలిపారు. మణిపూర్ ప్రజలను ఉద్దేశించి సోనియాగాంధీ ప్రసంగించిన తర్వాతే ప్రభుత్వం మేల్కొందని అన్నారు. మణిపూర్‌లో పరిస్థితిపై జూన్ 24న షా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 'ప్రారంభంలో అటువంటి తీవ్రమైన సమావేశానికి ప్రధాన మంత్రి గైర్హాజరు కావడం అతని 'పిరికితనం', అతని వైఫల్యాలను చూపుతుంది. అనేక మంది ప్రతినిధులు ఆయనతో సమావేశాలను కోరినప్పటికీ, ఆయనకు సమయం లేదు' అని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు. ఈ పరిస్థితికి హోం మంత్రి స్వయంగా అధ్యక్షత వహించి ఎటువంటి పురోగతి సాధించలేదని పేర్కొన్న ఆయన, వాస్తవానికి తన పర్యటన నుంచి పరిస్థితులు 'అధ్వానంగా' ఉన్నాయని అన్నారు. 'అతని సారథ్యంలో మనం నిజమైన శాంతిని ఆశించగలమా' అని సందేహం వెలిబుచ్చారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వాన్ని పక్షపాతంతో కొనసాగించడం, రాష్ట్రపతి పాలనను అమలు చేయకపోవడం అపహాస్యం' అని తెలిపారు.

అమూల్ గర్ల్ సృష్టికర్త సిల్వెస్టర్ డాకున్హా కన్నుమూత

అహ్మదాబాద్: ప్రముఖ డెయిరీ ఉత్పత్తుల బ్రాండ్ అమూల్ గర్ల్ యాడ్ సృష్టికర్త, ప్రముఖ అడ్వర్టైజింగ్ నిపుణు సిల్వెస్టర్ డాకున్హా (80) మృతిచెందారని గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జయేన్ మెహతా ట్విట్టర్ ద్వారా తెలిపారు. డాకున్హా కమ్యూనికేషన్స్ ప్రెసిడెంట్ సిల్వెస్టర్ ముంబైలో మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. సిల్వెస్టర్ డాకున్హా 1966లో జీసీఎంఎంఎఫ్ యాజమాన్యంలోని అమూల్ బ్రాండ్ కోసం 'అట్టర్లీ బటర్లీ' యాడ్ కోసం 'అమూల్ గర్ల్'ని పరిచయం చేశారు. ఎరుపు రంగు చుక్కల ఫ్రాక్‌లో కనిపించే పాపాయి కారణంగా అమూల్ బ్రాండ్‌కు ఎంతో కొత్త గుర్తింపు వచ్చింది.ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు అమూల్ గర్ల్‌ను కంపెనీ నేటికీ కొనసాగుతున్నది. ఆయన మృతికి కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ నివాళు లర్పించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ సిల్వెస్టర్ మృతికి సంతాపం తెలిపారు. ప్రకటనల రంగంలో అగ్రగామిగా నిలిచారని కొనియాడారు. అమూల్ జనరల్ మార్కెటింగ్ మేనేజర్ పవన్ సింగ్ సైతం సిల్వెస్టర్ మృతికి విచారం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే ఎక్కువ కాలం నడిచే వాణిజ్య ప్రకటనల్లో అమూల్ గర్ల్ ఒకటని ఆయన అన్నారు. ప్రకటనలతో కంపెనీ కొత్త శిఖరాలను తాకిందని చెప్పారు.

తొమ్మిదేళ్లలో భారీగా ఉపాధి అవకాశాలు

కేంద్ర కార్మికమంత్రి భూపేందర్ యాదవ్ వెల్లడి

న్యూదిల్లీ: గత తొమ్మిదేళ్లలో దేశంలో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగాయని, 2014 నుంచి దాదాపు 1.25 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ గురువారం తెలిపారు. మంత్రిత్వ శాఖ చేసిన అనేక కార్మిక సర్వేలను ప్రస్తావిస్తూ, 2014 నుండి 2022 వరకు ఉపాధిలో భారీ పెరుగుదల ఉందని యాదవ్ చెప్పారు. గత తొమ్మిదేళ్లలో కార్మిక శాఖ పనితీరుపై మంత్రి విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ కాలంలో దేశంలో దాదాపు 1.25 కోట్ల ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు.

మంత్రి తన ప్రకటనను సమర్థించేందుకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) డేటాను ప్రస్తావించారు. "మీరు ఈపీఎఫ్‌ఓ డేటాను చూస్తే, పెన్షనర్ల సంఖ్య (ఉద్యోగుల పెన్షన్ పథకం 1995 కింద) 2014-15లో 51 లక్షల నుండి 2021-22 నాటికి 72 లక్షలకు పెరిగింది. దాదాపు 22 లక్షల మంది రిటైరయ్యారు కానీ ఈపీఎఫ్‌వో నిర్వహిస్తున్న సామాజిక భద్రతా పథకం కింద రిజిస్ట్రేషన్లు పెరిగాయి" అని ఆయన వివరించారు. 2014-15లో మొత్తం రిజిస్టర్డ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 15.84 కోట్లుగా ఉందని, 2021-22 నాటికి అది 27.73 కోట్లకు పెరిగిందని ఈపీఎఫ్‌వో డేటా వెల్లడించింది. ఈ వారం ప్రారంభంలో విడుదల చేసిన ఈపీఎఫ్‌ఓ తాజా పేరోల్ డేటాను కూడా ఆయన ప్రస్తావించారు.

ఈ సంవత్సరం ఏప్రిల్‌లో 17.20 లక్షల మంది సభ్యులు కొత్తగా చేరారు. ఈపీఎఫ్‌ఓలో కొత్త సభ్యుల నమోదు 2022-23లో 1.38 కోట్లుగా ఉంది. మొత్తం శ్రామిక శక్తిలో సంఘటిత కార్మికులు కేవలం 10 శాతం మాత్రమేనని, అనధికారిక రంగంలో 90 శాతం మంది ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

సమీక్షిస్తున్నాం... ఖరారు కాలేదు

ప్రభుత్వోద్యోగుల పెన్షన్ వ్యవస్థపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ

న్యూదిల్లీ : ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ వ్యవస్థను సమీక్షించడానికి ఆర్థిక కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ సంప్రదించే ప్రక్రియలో ఉందని, దాని నివేదికను ఇంకా ఖరారు చేయాల్సి ఉందని మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. జాతీయ పెన్షన్ వ్యవస్థ (ఎన్‌పీఎస్) ప్రస్తుత కార్యచరణ, నిర్మాణం నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ పథకాన్ని సమీక్షించడానికి, అవసరమైతే ఏవైనా మార్పులను సూచించడానికి ఆర్థిక కార్యదర్శి టి.వి.సోమనాథన్ అధ్వర్యంలో మంత్రిత్వ శాఖ ఏప్రిల్‌లో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. 'గత బడ్జెట్ సమావేశాల్లో లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి చేసిన ప్రకటనకు అనుగుణంగా ఆర్థిక కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటయిన కమిటీ, ప్రస్తుతం దాని చర్చల మధ్యలో ఉంది. భాగస్వామ్యులందరినీ సంప్రదించే ప్రక్రియలో ఉంది. కమిటీ ఇంకా ఎలాంటి నిర్ధారణలకు రాలేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ ట్వీట్ చేసింది. దాని నిబంధనల ప్రకారం, ఆర్థికపరమైన చిక్కులు, మొత్తం బడ్జెట్ స్థలంపై ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్‌పీఎస్ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనరీ ప్రయోజనాలను మెరుగుపరిచే ఉద్దేశంతో వాటిని సవరించే చర్యలను కమిటీ సూచిస్తుంది. తద్వారా ఆర్థిక వివేకం సాధారణ పౌరులను రక్షించడానికి నిర్వహించబడుతుంది. సోమనాథన్ అధ్యక్షతన ఉన్న ఈ కమిటీలో డీవోపీటీలో కార్యదర్శి, వ్యయ శాఖ ప్రత్యేక కార్యదర్శి, పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) ఛైర్మన్ సభ్యులుగా ఉంటారు. అనేక బీజేపీయేతర పాలిత రాష్ట్రాలు డీఏ ఆధారిత పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) కి తిరిగి రావాలని నిర్ణయించుకున్నాయి. మరికొన్ని రాష్ట్రాల్లోని ఉద్యోగుల సంస్థలు కూడా దీని కోసం డిమాండ్‌ను పెంచాయి. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ స్కీమ్‌కు తిరిగి రావాలనే తమ నిర్ణయాన్ని కేంద్రానికి తెలియజేశాయి. ఎన్‌పీఎస్ కింద పేరుకుపోయిన కార్పస్‌ను తిరిగి చెల్లించమని అభ్యర్థించాయి. జనవరి 1, 2004 తర్వాత నియమితులైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఓపీఎస్‌ని పునరుద్ధరించే ప్రతిపాదన ఏదీ పరిశీలించడం లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటుకు తెలియజేసింది.

ఎన్‌పీఎస్ కింద, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు తమ చివరిగా తీసుకున్న జీతంలో 50 శాతం నెలవారీ పెన్షన్‌గా పొందారు. డీఏ రేట్ల పెంపుతో మొత్తం పెరుగుతూనే ఉంది. జనవరి 1, 2004న లేదా ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వంలో చేరిన సాయుధ దళాలలో ఉన్నవారు మినహా అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ అమలయింది. చాలా రాష్ట్ర/కేంద్ర పాలిత ప్రభుత్వాలు కూడా తమ కొత్త ఉద్యోగుల ఎన్‌పీఎస్‌ను కూడా నోటిఫై చేశాయి. పీఎఫ్‌ఆర్‌డీఏ (పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రకారం, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ మినహా 26 రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉద్యోగుల కోసం ఎన్‌పీఎస్‌ని నోటిఫై చేశాయి.

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

తొమ్మిది మంది మృతి

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని పితోర్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి 500 మీటర్ల లోతైన లోయలో పడిపోయింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి చెందగా, ఇద్దరు గాయప డ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. బాగేశ్వర్ జిల్లాలోని సామా నుంచి హోక్రాకు వెళ్తున్న బొలెరో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 9 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మృతదేహాలను వెలికి తీశారు. మరో ఇద్దరు వ్యక్తులు గాయపడగా వారిని రక్షించి తేజం ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. మృతులు, క్షతగాత్రులు ఆలయానికి బొలెరో వాహనంలో ఆలయంలో పూజల కోసం బయలుదేరారు. సంఘటనా స్థలం వద్ద రోడ్డు అధ్వాన్నంగా ఉందని, దాంతో వాహనం అదుపు తప్పి లోయలో పడి ఉంటుందని భావిస్తున్నారు.

ఉబర్‌లో లేఆఫ్... 200 మంది ఇంటికి

ముంబై: ఆర్థిక మాంద్యం భయాలతో ప్రపంచ వ్యాప్తంగా కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపు పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, మెటా, ట్విట్టర్, గూగుల్, అమెజాన్ వంటి ప్రపంచ దిగ్గజ కంపెనీలు వేల సంఖ్యలో తమ ఉద్యోగుల్ని తీసేశాయి . ఆదాయం తగ్గడంతో ఖర్చు తగ్గింపులో భాగంగానే ఉద్యోగులను తొలగిస్తున్నట్లు చెపుతున్నాయి. మరికొన్ని కంపెనీలు కూడా అదేబాటలో పయనిస్తున్నాయి. విడతల వారీగా ఉద్యోగుల్ని ఇంటికి పంపించేస్తున్నాయి. తాజాగా ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబర్ కూడా లేఆఫ్స్ జాబితాలో చేరింది. సంస్థలో ఉద్యోగుల్ని తొలగించనున్నట్లు ప్రకటించింది. రిక్రూట్ మెంట్ విభాగంలో 200 మందిని తొలగిస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా 32,700 మంది ఉద్యోగుల్ని కలిగి ఉన్న ఉబర్ కంపెనీ ఈ ఏడాది ప్రారంభంలో రవాణా సేవల విభాగం నుంచి 150 మందిని తొలగించింది. ఇది తన గ్లోబర్ వర్క్ ఫోర్సులో 1 శాతంగా ఉంది. తాజాగా రిక్రూట్ మెంట్ విభాగంలో 35 శాతం కోత పెట్టింది. కాగా, 2020 మధ్యలో మహమ్మారి ప్రారంభంలో ఉబర్ తన సిబ్బంది సంఖ్యను 17 శాతం తగ్గించింది.

పరిశోధన, ఆవిష్కరణల్లో 'జి-20' కీలకపాత్ర

ప్రధాని నరేంద్ర మోదీ

పూణె: జి-20 దేశాలు ప్రపంచ స్థాయిలో పరిశోధన , ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పూణేలో గురువారం జరిగిన జి-20 విద్యా మంత్రుల సమావేశంలో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. సాంకేతికత అందించే అవకాశాలు, దాని ద్వారా ఎదురయ్యే సవాళ్ల మధ్య సరైన సమతుల్యతను సాధించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. పరిశోధనా సహకారాన్ని పెంపొందించడానికి ప్రముఖులు తప్పనిసరిగా ఒక మార్గాన్ని సృష్టించాలని ఆయన అన్నారు. కొత్త ఇ-లెర్నింగ్‌ను వినూత్నంగా స్వీకరించి ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. మెరుగైన పాలనతో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఉండాలని ఆయన అన్నారు. విద్యారంగంలో గొప్ప సామర్థ్యాన్ని అందించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాన్ని మోదీ ప్రస్తావించారు. సాంకేతికత ద్వారా ఎదురయ్యే అవకాశాలు, సవాళ్ల మధ్య సరైన సమతుల్యతను సాధించడంలో జి-20 పాత్రను కూడా ఆయన నొక్కి చెప్పారు. దూరవిద్య ద్వారా పాఠశాల విద్యను అందించాలనే లక్ష్యంతో నెలకొల్పిన దీక్షా పోర్టల్‌ను కూడా ఆయన విడుదల చేశారు. 'డిజిటల్ టెక్నాలజీ ఈక్వలైజర్‌గా పనిచేస్తుంది. కలుపుకొనిపోవడాన్ని ప్రోత్సహిస్తుంది. విద్యకు ప్రాప్యతను పెంచడంలో ఇది శక్తి గుణకం. నేడు కృత్రిమ మేధస్సు అభ్యాసం, నైపుణ్యం విద్యారంగంలో గొప్ప సామర్థ్యాన్ని అందిస్తుంది. అవకాశాలతోపాటు సాంకేతికత కూడా సవాళ్లను విసురుతోంది. మనం సరైన సమతుల్యతను సాధించాలి. ఇందులో జి-20 కీలక పాత్ర పోషిస్తుంది' అని ప్రధాని మోదీ అన్నారు. 'భారతదేశంలో, మేము పరిశోధన, ఆవిష్కరణలకు కూడా ప్రాధాన్యతనిచ్చాము. దేశవ్యాప్తంగా 10,000 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశాం. ఇవి మా పాఠశాల పిల్లలకు పరిశోధన, ఆవిష్కరణ నర్సరీలుగా పనిచేస్తున్నాయి' అని మోదీ చెప్పారు.

ఈ ల్యాబ్‌లలో 7.5 మిలియన్ల కంటే ఎక్కువ మంది విద్యార్థులు 1.2 మిలియన్ కంటే ఎక్కువ వినూత్న ప్రాజెక్టులపై పని చేస్తున్నారన్నారు. జి-20 దేశాలు, వాటి సామర్థ్యాలతో ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌లో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రధాని అన్నారు.

సీఎస్ఎస్ అధికారులకు తక్షణ పదోన్నతి కల్పించాలి

ప్రధాని మోదీకి సీఎస్ఎస్ అధికారుల సంఘం లేఖ

న్యూదిల్లీ : సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ (సీఎస్ఎస్) అధికారుల సంఘం అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ) లను సెక్షన్ ఆఫీసర్ల గ్రేడ్‌కు పదోన్నతి కల్పించేలా ప్రధాని నరేంద్ర మోదీ జోక్యాన్ని కోరింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ) మంత్రిత్వ శాఖలలో సెక్షన్ ఆఫీసర్ల (సీఎస్ఎస్) తీవ్రమైన కొరత ప్రభుత్వ పని తీరును స్తంభింపజేస్తోందని, ప్రజా సేవలను సకాలంలో సమర్థవంతంగా, సకాలంలో అందించడంలో ప్రభావితం చేస్తుందని పదే పదే అంగీకరిస్తోందని ప్రధాన మంత్రికి రాసిన లేఖలో పేర్కొంది. 'అందుబాటులో ఉన్న ఖాళీలకు తగిన అర్హతను కలిగి ఉన్నప్పటికీ, కేవలం డీవోపీటీలోని కొంతమంది అధికారుల అయిష్టత కారణంగా కేంద్ర సచివాలయానికి వెన్నెముకగా పేర్కొనబడిన ఏఎస్‌వోలు ఉద్దేశపూర్వకంగా వారి పదోన్నతి (రెగ్యులర్, తాత్కాలికంగా) తీసివేయడం నిరుత్సాహపరుస్తుంది' అని సీఎస్ఎస్ అధికారుల సంఘం రాసిన లేఖలో తెలిపింది. 'సమయ నిర్దిష్ట పద్ధతిలో 10 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్న మీ అత్యంత స్వాగతించదగిన ప్రకటనకు' అనుగుణంగా అన్ని విభాగాల్లో నియామకాలు/పదోన్నతుల ద్వారా అన్ని రకాల ఉద్యోగాలను భర్తీ చేయాలని డీవోపీటీ అన్ని విభాగాలను ఆదేశిస్తోంది. 'అయితే, డీపీవోటీ దాని స్వంత మార్గదర్శకాల ప్రకారం సాధారణ, తాత్కాలిక పదోన్నతుల కోసం అన్ని పరిష్కారాలను కలిగి ఉన్నప్పటికీ, కనిపించని కారణాల వల్ల ఎస్‌వో గ్రేడ్‌లోని అన్ని ఖాళీలను దాని స్వంత సీఎస్ఎస్ కేడర్‌లో భర్తీ చేయడాన్ని పరిగణించడం లేదు' అని జూన్ 21 నాటి లేఖ పేర్కొంది. ప్రజా సేవను సమర్థవంతంగా అందించడం, సమర్థవంతమైన సుపరిపాలనలో పాలుపంచుకోవడం కోసం సీఎస్ఎస్ కేడర్‌ను బలోపేతం చేయడానికి జూన్ 30, 2023లోపు అన్ని అర్హత కలిగిన ఏఎస్‌వోలకు తక్షణ పదోన్నతి (రెగ్యులర్/అడ్-హాక్) ద్వారా ఎస్‌వో గ్రేడ్‌లోని అన్ని ఖాళీలను భర్తీ చేయడానికి ప్రధాన మంత్రి జోక్యాన్ని అధికారుల సంఘం కోరింది. అర్హులైన ఏఎస్‌వోలు అందరికీ తక్షణ పదోన్నతి కల్పించడం ద్వారా ఎస్‌వో గ్రేడ్‌లోని పెద్ద సంఖ్యలో ఖాళీలను (సుమారు 2,100) భర్తీ చేయాలని సీఎస్ఎస్ అధికారుల సంఘం జూన్ 8, 19, 2023 తేదీలలో కేంద్ర సిబ్బంది సహాయ మంత్రి జితేంద్ర సింగ్‌కు లేఖలను ఉదహరించింది.

'మోస్ట్ వాంటెడ్' కోతి నిర్బంధం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్‌లో దాదాపు 20 మందిపై దాడి చేసి రూ.21,000 రివార్డ్ ఉన్న 'మోస్ట్ వాంటెడ్' కోతిని ఎట్టకేలకు నిర్బంధించారు. డ్రోన్ సహాయంతో దానిని గుర్తించిన సిబ్బంది మత్తు మందు ఇచ్చి పట్టుకుని బోనులో బంధించారు. ఒక కోతి మానవులకు హానికరంగా మారింది. ఇళ్లపై తిరుగుతూ అనేక మందిపై దాడి చేసింది. గత 15 రోజుల్లో 20 మంది స్థానికులు కోతి దాడి వల్ల గాయాలపాలయ్యారు. వీరిలో 8 మంది పిల్లలు కూడా ఉన్నారు. జనాన్ని బెంబేలెత్తిస్తున్న ఈ కోతిని పట్టుకోవడంలో స్థానిక మున్సిపల్ సిబ్బంది చేతులెత్తేశారు. కోతులను పట్టుకునే ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ కోతిని పట్టుకున్న వారికి రూ.21,000 బహుమతి ఇస్తామని ప్రకటించారు. జిల్లా కలెక్టర్ చొరవతో ఉజ్జాయినీ అటవీ శాఖకు చెందిన రెస్క్యూ టీమ్ రాజ్‌గఢ్‌కు బుధవారం చేరుకుంది. మున్సిపల్ సిబ్బంది, స్థానికుల సహాయంతో ఆ కోతిని పట్టుకునేందుకు నాలుగు గంటలు శ్రమించారు. డ్రోన్ సహాయంతో కోతి ఎక్కడ ఉన్నదో గుర్తించారు. దానికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చారు. మగతలో ఉన్న ఆ కోతిని పట్టుకుని బోనులో బంధించారు. ఈ సందర్భంగా స్థానికులు జై శ్రీరామ్, జై భజరంగ్ దళ్ అంటూ నినాదాలు చేశారు. మత్తు వీడిన తర్వాత బోనులో బంధించిన ఆ కోతి ఆగ్రహంతో రగిలిపోయింది. బోను నుంచి బయటపడేందుకు చాలా ప్రయత్నించింది. మనుషులకు ప్రమాదకరంగా మారిన ఆ కోతిని దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని అటవీ శాఖ సహాయక సిబ్బంది తెలిపారు. కాగా, 'మోస్ట్ వాంటెడ్' కోతిని పట్టుకునేందుకు ప్రకటించిన రూ.21,000 రివార్డును ఆ టీమ్‌కు అందజేస్తామని రాజ్‌గఢ్ మున్సిపల్ అధికారులు తెలిపారు.

రద్దీ దృష్ట్యా సాధారణ బోగీల్లో సౌకర్యాలు కల్పించండి

అన్ని జోన్లకు రైల్వే బోర్డు లేఖ

న్యూదిల్లీ : వేసవి, భారీ రద్దీ నేపథ్యంలో సాధారణ బోగీల్లో ప్రాథమిక సౌకర్యాలు ఉండేలా చూడాలని కోరుతూ అన్ని రైల్వే జోన్లకు రైల్వే బోర్డు లేఖ రాసింది. వేసవి సీజన్‌లో సాధారణ తరగతి రైలు కోచ్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉన్న చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో కనిపించిన కొన్ని రోజుల తర్వాత అన్ని జోన్లకు ఈ లేఖ రాసింది. ఆపరేషన్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ సభ్యుడు జయవర్మ సిన్హా రాసిన లేఖలో జనరల్ మేనేజర్‌లు ఏర్పాట్లను సమీక్షించాలని, రైళ్లలోని ప్రయాణికులకు, ముఖ్యంగా సాధారణ రెండవ తరగతి (జీఎస్) కోచ్‌లలో ప్రాథమిక సేవలు అందించేలా చూడాలని కోరారు. సాధారణ తరగతి కోచ్‌లు అన్ని మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల ముందు, చివర ఉంటాయి. రైళ్లు నిలిచే అన్ని చోట్ల వద్ద అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌ల దగ్గర సరసమైన ధరకు భోజనం, తాగునీరు, వెండింగ్ ట్రాలీలను ఏర్పాటు చేయాలని అన్ని జోనల్ రైల్వేల జనరల్ మేనేజర్‌లకు సూచించింది. ఎంపిక చేసిన స్టేషన్లలో జీఎస్ కోచ్‌లను శుభ్రపరచడంతో పాటు సేవల నాణ్యతను మెరుగుపరచడానికి అనేక ప్రాంతాలను లేఖలో సూచించింది. ఎంపిక చేసిన స్టేషన్లలో కోచ్‌లకు పూర్తి నీరు ఉండేలా చూడాలని, కొన్ని రైళ్లు నీటి కొరతను ఎదుర్కొంటున్నట్లయితే, అదనపు నీటి స్టేషన్లను గుర్తించి రైల్వే బోర్డు పరిశీలనకు సిఫార్సు చేయాలని పేర్కొంది. ప్రాదేశిక అధికార పరిధి ఉన్న కోచ్‌లలో ఓబీహెచ్ఎస్ (ఆన్‌బోర్డ్ హౌస్ కీపింగ్) సిబ్బందిని నియమించవచ్చు. వారు జీఎస్ కోచ్‌లలో రెండు స్టాపింగ్ స్టేషన్‌ల మధ్య ప్రయాణించి, లింక్‌లో మరొక రైలులో తిరిగి వచ్చేలా పరిశీలించవచ్చు' అని వివరించింది. సరసమైన ధరకు భోజనం, తాగునీటి పౌచ్‌లతో కూడిన రైలు వైపు వెండింగ్ ట్రాలీల ఏర్పాటు చేయడం, ఆగిపోయే సమయంలో జీఎస్ కోచ్‌ల ముందు ఉంచేలా చేయాలని సిన్హా చెప్పారు. 'రైళ్లలో ముఖ్యంగా జీఎస్ కోచ్‌లలో ప్రయాణీకుల రద్దీని నెలాఖరు వరకు ప్రతిరోజూ సమీక్షించాలి. అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి' అని పేర్కొంది. భారతీయ రైల్వేలు సాధారణంగా వేసవి సెలవుల కారణంగా మే నెలలో వేసవి రద్దీని ఎక్కువగా చూస్తుండగా, జూన్‌లో తిరిగి వచ్చే రద్దీ కనిపిస్తుంది.

బంగారం వ్యాపారులపై ఐటీ దాడులు

న్యూఢిల్లీ : పెద్దమొత్తంలో బంగారం కొనుగోళ్లు, అమ్మ కాలు జరిపే బులియన్ ట్రేడర్లు, జ్యూవెలర్లపై దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు దాడులు చేపట్టారు. అక్రమ లావాదేవీల ద్వారా వచ్చిన సొమ్మును బంగారం వ్యాపారులు స్థిరాస్థి వ్యాపారంలో పెట్టుబడులు పెడుతున్నారని ఆరోపణలున్నాయి.లక్నో, నోయిడా, దిల్లీ, కాన్పూర్, కోల్‌కతా వంటి అనేక ప్రాంతాల్లోని వివిధ ప్రదేశాల్లో ఆదాయ పన్ను అధికారులు దాడులు నిర్వహించారు. కాన్పూ ర్‌లో ఇద్దరు వ్యాపార వేత్తల ఇళ్లను చుట్టుముట్టిన ఐటీ అధికా రులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బంగారం క్రయ విక్రయ లావాదేవీల ద్వారా ఆర్జించిన భారీ మొత్తాలను బులియన్ ట్రేడర్లు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెడుతున్నారు.

పర్యాటక అభివృద్ధి కోసం యోగాను ఉపయోగించుకుంటున్న ఒమన్ ప్రభుత్వం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఒమన్ ప్రభుత్వం ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయంతో కలిసి ఒక ఐకానిక్ వీడియోను రూపొందించింది. 'సోల్‌ఫుల్ యోగా, సెరీన్ ఒమన్' అనే టైటిల్‌తో ఉన్న ఈ వీడియోలో, మస్కట్ నగరం, చుట్టుపక్కల పర్వతాలు, బీచ్‌లు, ఇసుక దిబ్బలతో సహా అద్భుతమైన ప్రదేశాల నేపథ్యంలో వివిధ దేశాలకు చెందిన యోగా ఔత్సాహికులు అందమైన యోగా భంగిమలు చేయడం చూడవచ్చు. ఈ వీడియోను ఒమన్ పర్యాటక మంత్రిత్వ శాఖ అనుబంధ సంస్థ 'విజిట్ ఒమన్' భాగస్వామ్యంతో రూపొందించారు.

ఒక విదేశీ ప్రభుత్వం తమ సొంత దేశాన్ని ప్రమోట్ చేయడానికి యోగాను ఉపయోగించడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య క్రమశిక్షణగా యోగాకు పెరుగుతున్న ఆదరణ, ఆమోదాన్ని ఈ వీడియో ప్రదర్శిస్తుంది.

మరో 72 సైన్స్ అవార్డుల రద్దు

కేంద్రం ప్రకటన

న్యూదిల్లీ : ఈ ఏడాది మరో 72 సైన్స్ అవార్డులను రద్దు చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గత సంవత్సరం 300కిపైగా సైన్స్ అవార్డులను రద్దు చేసిన విషయం తెలిసిందే. సైన్స్, హెల్త్ రంగాల్లో అవార్డులను నిలపేయాలని శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు భారత జాతీయ సైన్స్ అకాడమీ (ఐఎన్ఎస్ఏ) ఈ అవార్డులను నిలిపేసింది. ప్రభుత్వ నిధులు అందుకుంటున్న సంస్థలు ఇచ్చే డజన్ల కొద్దీ సైన్స్, హెల్త్ అవార్డులను ఇకపై కొనసాగించరాదని కేంద్రం భావిస్తోంది. ఆ నిర్ణయంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. యువ శాస్త్రవేత్తలు, సైన్స్ టీచర్లు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలు, తదితరులకు ఇవ్వడానికి ఉద్దేశించిన 72 అవార్డులను ఐఎన్ఎస్ఏ రద్దు చేసింది. మరో సంస్థ అయిన నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా (ఎన్ఏఎస్ఐ) కూడా20కి పైగా అవార్డులను రద్దు చేసిందని అకాడమి అధికారులు మీడియాకు తెలిపారు. శాస్త్రవేత్తల కోసం శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన ఈ అవార్డులను ఇలా రద్దు చేయాలన్న నిర్ణయాన్ని అనేక మంది శాస్త్రవేత్తలు వ్యతిరేకిస్తున్నారు. మన శాస్త్రీయ సంస్థల స్వయంప్రతిపత్తిని లాక్కునేందుకు చేపట్టిన ప్రక్రియే ఇదని, గతంతో మాజీ ప్రభుత్వ శాస్త్రవేత్త ఒకరు వ్యాఖ్యానించిన దానికి ఇది తాజా సాక్ష్యాధారమని అంటున్నారు.

ఒక సంస్థ ప్రభుత్వ నిధులు అందుకుంటున్నపుడు ఎవరికి ఎప్పుడు అవార్డులు ఇవ్వాలనేది ప్రభుత్వం నిర్ణయించాలన్నది ఇందులోని అంతర్యమని ఒక శాస్త్రవేత్త వ్యాఖ్యానించారు. ఇండియన్ అకాడమి ఆఫ్ సైన్సెస్ అనే పేరు గల మరో అకాడమికి కూడా ఇలాంటి ఆదేశాలే అందాయి కానీ తాము ఎలాంటి అవార్డులను ఇవ్వడం లేదని లేఖ రాసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ మూడు అకాడమిలను స్వయం ప్రతిపత్తి సంస్థలుగా పేర్కొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డీఎస్‌టీ) నుంచి ఇవి నిధులు అందుకుంటున్నాయి.

విశాలాంధ్ర పూర్వ అసోసియేట్ ఎడిటర్ మక్కెన సుబ్బారావు, ముఖ్య అతిథి ఎన్.వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న ఆర్వీ రామారావు, జల్లి విల్సన్, ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఓబులేసు, హరినాథరెడ్డి, గడ్డం కోటేశ్వరరావు, మనోహర్‌నాయుడు, అజయ్‌బాబు

వార్షికోత్సవ సభకు హాజరైనవారిలో ఒక భాగం

ప్రచార సాధనాలు సమాజ చలనానికి

అద్దం పట్టాలి

- ఉత్పత్తి సాధనంగా మారిన వార్త
- విశాలాంధ్ర వార్షికోత్సవ సభలో వేణుగోపాల్

విశాలాంధ్ర-విజయవాడ: ఏ లక్ష్యాలు నెరవేర్చటానికి పత్రికలు ఏర్పడ్డాయో వాటి ప్రాధాన్యతలు నిర్ణయించుకుని సమాజ చలనానికి అద్దం పట్టాలని వీక్షణం మాసపత్రిక సంపాదకులు ఎన్.వేణుగోపాల్ అన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్వర్యంలో నిర్వహించిన విశాలాంధ్ర దినపత్రిక 71 వ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం విజయవాడలోని విశాలాంధ్ర ప్రధాన కార్యాలయంలో ఈ సభ జరిగింది. వేణుగోపాల్ 'ప్రచార సాధనాలు - బాధ్యతలు - బాధ్యతారాహిత్యం' అనే అంశంపై ప్రధాన ఉపన్యాసం చేశారు. పత్రికా రంగంపై తీవ్రమైన అసంతృప్తితో ఉన్న కారణంగా పత్రికలు చదవటం చాలామంది మానేశారని చెప్పారు. వినోదం, వ్యాపార ప్రకటనలకు సాధనంగా మారటంతో ప్రజలు ఆదరించటం లేదన్నారు. సమాచారం తెలుసుకోకుండా జీవించలేని స్థితిలో ఉన్న కారణంగా ఇష్టం లేకపోయినా చదవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వార్త అనేది సామాజిక సమాచారం కాకుండా ఉత్పత్తిగా మారిందనీ, విలువలు తగ్గాయని తెలిపారు. రాజకీయ పార్టీలు, పెట్టుబడి, కట్టుకథ వల్ల బాధ్యతారాహిత్యం వచ్చిందన్నారు. దాంతో ప్రచార సాధనాలను నమ్మలేని స్థితి ఏర్పడిందన్నారు. పత్రికలు అవి చేయాలన్ని బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తున్నాయని చెప్పారు. సమాజాన్ని దారుణమైన వక్రీకరణలో చూపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చానల్స్ ఒక మార్గాన్ని ఎంచుకుని దృష్టి మళ్లిస్తున్నాయన్నారు. సంఘ్ పరివార్ శక్తులు కట్టుకథలు అల్లుతున్నాయని విమర్శించారు. ప్రధాన స్రవంతిలో వచ్చిన వార్తను వేర్వేరు కోణాల్లో రాయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక చైతన్యానికి ప్రతీకలు పత్రికలన్నారు. వార్త వ్యాపార వస్తువుగా మారటంతో మీడియా స్థానాన్ని మాఫియా ఆక్రమించిందన్నారు. చిన్నపత్రికలు ప్రధాన స్రవంతి పత్రికలను వ్యతిరేకించి సమాచారాన్ని అందిస్తున్నాయని తెలిపారు. అక్షరానికి సమాజం పట్ల బాధ్యత ఉంటుందని పత్రికా రంగం ఆ బాధ్యతతో పని చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ విశాలాంధ్ర లేకపోతే తాను లేనని ఆ పత్రికతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విశాలాంధ్ర దిన పత్రిక సంపాదకులు ఆర్వీ రామారావు మాట్లాడుతూ విశాలాంధ్ర లేకపోతే గురజాడ గురించి తెలిసేది కాదన్నారు. గురజాడ రచనలు రక్షించటంలో శెట్టి ఈశ్వరరావు చేసిన సేవలను గుర్తు చేశారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి కోశాధికారి జి. ఓబులేసు మాట్లాడుతూ బూర్జువా పార్టీలు పత్రికలు స్థాపిస్తున్నాయన్నారు. ఆ పత్రికలు కార్మికులను పట్టించుకోవన్నారు. సమాజాన్ని చలనశీలంగా ఉంచటానికి ప్రత్యామ్నాయ మార్గాలను మేధావులు సూచించాలని కోరారు. టీవీ చానల్స్ కొంత మందితో మాట్లాడి చర్చావేదికలు నిర్వహించి ప్రజల్ని ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. సామాజిక, సాంస్కృతిక రంగంలో కొత్త విధానాలను ప్రజలకు తెలియజేసేవి పత్రికలే అన్నారు. కార్మికులకు కమ్యూనిస్టు పత్రికలు ప్రాధాన్యతను ఇస్తున్నాయన్నారు.

విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ నిర్వహణలో కష్టాలు, నష్టాలున్నా విశాలాంధ్ర పత్రికను కార్మికులకు అనుకూలంగా చేశామన్నారు. ప్రజాదరణ, మేధావుల ఆదరణతో 71సంవత్సరాలుగా నిర్వహిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం పగతో, కక్షపూరితంగా వున్నా, ఉద్యోగులు, పాత్రికేయులు ప్రమాణాలు పాటిస్తూ పట్టుదలతో, త్యాగం చేస్తున్నారన్నారని అభినందించారు. జనరల్ మేనేజర్ పి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సహకారం లేకపోయినా విశాలాంధ్ర విలేకర్లు, సిబ్బంది ఎంతో కష్టపడి సంస్థను కాపాడుతున్నారని అభినందించారు. ఎంతో బాధ్యతగా సక్రమంగా పని చేయటం వల్ల సంస్థ పురోభివృద్ధి చెందుతుందన్నారు. విశాలాంధ్ర పూర్వ అసోసియేట్ ఎడిటర్ మక్కెన సుబ్బారావుకు శాలువాతో చిరుసత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమ్యూనిస్టు జర్నలిస్టులను తయారు చేసుకోవాలని సూచించారు. విశాలాంధ్ర ఎగ్జిక్యూటీవ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు స్వాగతం పలికారు. పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, అక్కినేని వనజ, కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, దోనేపూడి శంకర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.రాంప్రసాద్, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు అక్కినేని చంద్రరావు, విశాలాంధ్ర మాజీ జనరల్ మేనేజర్ వై.చెంచయ్య, ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందూ జనార్ధన్, విరసం నాయకులు అరసవిల్లి కృష్ణ, వివిధ ప్రచార మాధ్యమాల ప్రతినిధులు, నగరంలోని ప్రముఖులు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు తదితరులు హాజరయ్యారు. తొలుత ప్రజానాట్యమండలి నాయకుడు ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గీతాన్ని ఆలపించారు. నవచైతన్య పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ ఏటుకూరి ప్రసాద్, వి.మదన్ (ప్రజాపక్షం దినపత్రిక), స్వాతంత్ర్య సమరయోధులు పరకాల పట్టాభి రామారావు కుమార్తె పరకాల ఉషా తదితరులు విశాలాంధ్ర వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

'టికు వెడ్స్ షేరు' నుంచి 'తుమ్సేమిల్కే' పాట విడుదల

ముంబై: ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కామెడీ డ్రామా 'టికు వెడ్స్ షేరు' సినిమా నుంచి మనసుని కుదిపే ట్రాక్ అయిన తుమ్సే మిల్కే పాటని సోనీ మ్యూజిక్ ఎంటర్‌టైన్‌మెంట్ అమెజాన్ ప్రైమ్ వీడియోతో కలిసి విడుదల చేసింది. నవాజుద్దీన్ సిద్ధిఖీ, అవనీత్‌కౌర్ నటించిన ఈట్రాక్‌ని మోహిత్ చౌహాన్ పాడారు. తుమ్ సే మిల్కే పాటలోని భావం టికు మరియు షేరు అనే ఇద్దరు ప్రేమికులు ప్రయాణించే అందమైన ప్రేమ, భాగస్వామ్య అభిరుచిని అన్వేషిస్తుంది. వాస్తవానికి సినిమాని దాని సారాంశంతో సూచిస్తుంది. బహుముఖ ప్రజ్ఞావంతుడైన నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ, అందమైన అవనీత్ కౌర్ అద్భుతంగా నటించారు. ఏ మాత్రం మ్యాచ్ చేయలేని అతని నైపుణ్యం, ప్రతి నోట్‌లో భావోద్వేగలను జోడించడం అనేవి పాటకి జీవాన్ని ఇస్తాయి. గౌరవ్ ఛటర్జీ, సాయికబీర్‌లు కంపోజ్ చేసిన ఈ పాటను సాయి కబీర్ రాయడం విశేషం.

'తైపీ ఓపెన్' ప్రణయ్ దూకుడు

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ దూకుడు కొనసాగిస్తున్నాడు. ఈమధ్యే మలేసియా మాస్టర్స్ సూపర్ 500 టైటిల్ గెలిచిన అతను తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. 2014 ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన టామీ సుగియర్టోపై 21-9, 21-17తో ప్రణయ్ గెలుపొందాడు. మొదటి సెట్‌లో ఇండోనేసియా ప్రత్యర్థి నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురవ్వలేదు. కానీ, రెండో గేమ్‌లో ప్రణయ్ 4-0తో వెనకబడ్డాడు. అయితే అనూహ్యంగా పుంజుకొని 21-17తో సెట్ గెలుచుకున్నాడు. కేవలం 36 నిమిషాల్లోనే మ్యాచ్ ముగించాడు. సెమీస్ పోరులో అతను ఐదోసీడ్ హాంకాంగ్‌కు చెందిన అంగస్ కా లాంగ్‌ను ఎదుర్కొంటాడు.

కశ్యప్ ఔట్: ఇదే టోర్నీలో మరో భారత ఆటగాడు పారుపల్లి కశ్యప్ ఓటమితో నిష్క్ర మించాడు. సూ లీ యాంగ్ చేతిలో 16-21, 17-21తో ఓటమి చవిచూశాడు. దాంతో, ఈ టోర్నీలో భారత్ నుంచి ప్రణయ్ ఒక్కడే మిగిలాడు. ఈ ఏడాది జోరు మీదున్న ప్రణయ్ ఇండోనేసియా ఓపెన్‌లోనూ సత్తా చాటాడు. సెమీఫైనల్ వరకు వెళ్లాడు. కానీ, వరల్డ్ నంబర్ 1 విక్టర్ అక్సెల్‌సెన్ చేతిలో ఓటమిపాలయ్యాడు.

KUSALAVA™ GROUP
విశాలాంధ్ర 71 వ వార్షికోత్సవం
Quantum eScooters

GO ELECTRIC.
GO QUANTUM.

Zero down payment
100% on road finance*
Starting from ₹85,470 Ex-showroom

Visit: Kusalava Electric, Currency Nagar I Call: 79977 10236
*Terms and conditions apply

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.